తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

# అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 వేలు: 3 సంపుటి:3 సంచిక: 229

ఆదివారం 25, జనవరి 2026

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## ఫోన్ ట్యాపింగ్.. అత్యంత దుర్మార్గం




- ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగి చూడటం ఏ సంస్కృతి?
- సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేలాల్సిందే
- ప్రజల గోప్యతను తుంగలో తొక్కిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- వ్యవస్థలను భ్రష్టు పట్టించి, రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టడం దుర్మార్గం.
- చట్టం తన పని తాను చేస్తోంది? కేటీఆర్, హరీష్ రావుల గగ్గోలు ఎందుకు?
- ద్వజమెత్తిన మంత్రి జూపల్లి

4లో

# సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి



- కాంగ్రెస్, బిఆర్ఎస్ ఇద్దరూ దోపిడీ దారులే
- ఉమ్మడి ఏపిని మించి సింగరేణి గనుల దోపిడీ
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,జనవరి24 (అక్షరగళం):** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన..మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనుల కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి మిగతా.. 2లో

# అందరి బాగోతాలను బయటపెడతాం..




- ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్లల్లో అక్రమాల గుర్తింపు
- త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్
- ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు
- జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు
- ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జనవరి24 (అక్షరగళం):** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక మిగతా.. 2లో

## సీఎం రేవంత్‌పై కేటీఆర్ అనుచిత భాష

- మతితప్పి మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేత
- మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతామన్న పొంగులేటి

**హైదరాబాద్,జనవరి24 (అక్షరగళం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన కేటీఆర్ మాట్లాడుతున్న భాష సరిగా లేదని మతి లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి మీడియా సమావేశంలో విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు వ్యక్తిగతంగా తాను రిఫరెండంగా భావిస్తున్నానని అన్నారు. ఇప్పటికే రెండుసార్లు కేటీఆర్ రిఫరెండం అన్నారు. మళ్లీ ఇప్పుడు మిగతా.. 2లో




- సైట్ విజిట్ నిబంధన గతంలో ఉన్నదే
- ఎవరి ప్రయోజనం కోసం..ఎవరు చేస్తున్నారు
- ఒకరు కథనం..మరోకరు లేఖ... ఇంకొకరు విచారణ
- వీరికి ఉన్న సంబంధం ఏమిటో ప్రజలకు తెలియాలి
- సింగరేణిపై కిషన్ రెడ్డి విచారణను స్వాగతిస్తున్నాం
- అన్ని వ్యవహారాలపై విచారణ జరగాలన్నదే తన అభిప్రాయం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

# సింగరేణిపై దుష్ప్రచారం... కట్టుకథలు..!

**హైదరాబాద్,జనవరి24 (అక్షరగళం):** సింగరేణిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. సింగరేణి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొందరు రాతలు రాస్తున్నారని, ఈ నినాదాల వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయి? అంటూ ప్రశ్నలు సంధించారు. అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థపై నిందలు మోపుతూ, కార్మికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. శనివారం నాడు ప్రజాభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణిపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వంపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'ఒకరు కథనం రాశారు, మరొకరు లేఖ రాశారు, ఇంకొకరు విచారణకు ఆదేశించారు, ఈ ముగ్గురికీ ఉన్న సంబంధం ఏంటి' అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. సింగరేణి అటానమస్ సంస్థ అని, అన్ని నిర్ణయాలు వారే తీసుకుంటారని భట్టి తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రావడం, విచారణ జరిపించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. సింగరేణిలో తాను వచ్చాకే సైట్ విజిట్ నిబంధన వచ్చిందని ప్రచారం చేస్తున్నారని, నిజాలు బయటకు రావాలని, మిగతా.. 2లో

## నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

- రంగంలోకి దిగిన ఇద్దరు కేంద్ర బృందం సభ్యులు

**హైదరాబాద్,జనవరి24(అక్షరగళం):** నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వివాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల సాంకేతిక కమిటీ సింగరేణి భవనానికి చేరుకుని విచారణను ప్రారంభించింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై కేంద్ర బృందం ఆరా తీస్తోంది. సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్ వద్ద ఈ బృందం వివరాలు సేకరిస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటలపాటు విచారణ జరిపింది. నేడు మరోసారి విచారణ చేపట్టిన బృందం వచ్చే సోమవారం తన నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. కాగా.. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన సరికాదని, మిగతా.. 2లో






## అమెరికా అతలాకుతలం

- 16 రాష్ట్రాల్లో మంచు తుపాను విలయతాండవం...
- 20 కోట్ల మంది ప్రజలపై తీవ్ర ప్రభావం
- 8,000కు పైగా విమాన సర్వీసులు రద్దు
- అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన విపత్తుగా ప్రకటించిన ప్రభుత్వం

**వాషింగ్టన్, జనవరి 24(అక్షరగళం):** అమెరికా చరిత్రలోనే అత్యంత తీవ్రమైన మంచు తుపానుల్లో ఒకటి దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు సుమారు 2,000 మైళ్ల మిగతా.. 2లో



## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

**న్యూఢిల్లీ,జనవరి24 (అక్షరగళం):** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని మిగతా.. 2లో

## బండి, ధర్మపురిలకు కేటీఆర్ లీగల్ నోటీసులు

- పరువు తీసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్

**హైదరాబాద్,జనవరి24 (అక్షరగళం):** కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ లీగల్ నోటీసులు



పంపించారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకు సంజయ్, అర్వింద్‌లకు విడివిడిగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అడ్డగోలుగా మాట్లాడిన వీరు వెంటనే క్షమాపణ మిగతా.. 2లో



## దేశవ్యాప్తంగా 18వ రోజ్‌గార్ మేళా

- 61,000 మందికి నియామక పత్రాలు అందించిన మోడీ

**న్యూఢిల్లీ,జనవరి24 (అక్షరగళం):** దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ మిగతా.. 2లో

## చైనాకు బలైపోతావ్ జాగ్రత్త!




- కెనడాను హెచ్చరించిన ట్రంప్

**వాషింగ్టన్,జనవరి24 (అక్షరగళం):** మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటును కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టువారు మిగతా.. 2లో

## మున్సిపల్ ఎన్నికలకు బిఆర్ఎస్ ఇన్‌ఛార్జ్‌లు

- మున్సిపాలిటీల వారీగా సమన్వయ కర్తల నియామకం

**హైదరాబాద్,జనవరి24 (అక్షరగళం):** పురపాలక ఎన్నికల కోసం బిఆర్ఎస్ ఇన్‌ఛార్జిలను నియమించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయకర్తల జాబితాను ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఒక సీనియర్ నాయకుడికి మిగతా.. 2లో




## యధాతథంగా టీ హబ్



- ప్రభుత్వ కార్యాలయాల మార్పవద్దన్న సిఎం
- అమెరికా నుంచి సిఎస్‌కు రేవంత్ ఆదేశాలు

**హైదరాబాద్,జనవరి24(అక్షరగళం):** టీహబ్‌ను స్టార్టప్‌ల కేంద్రంగానే కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై సీఎస్ రామకృష్ణారావుకు మిగతా.. 2లో

తెలుగు దినపత్రిక https://aksharagalam.com అక్షరగళం ప్రతి అక్షరం ప్రజల కోసం

# నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

(మొదటి పేజీ తరువాయి)

అక్రమాలకు దారి తీస్తుందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్లను రద్దు చేయాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవినీతి ఆరోపణలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. సమగ్ర విచారణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందంతో కమిటీ ఏర్పాటైంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా,బొగ్గుశాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం సింగరేణిలో పర్యటించి.. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి, ఆ నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# సింగరేణిపై దుష్ప్రచారం... కట్టుకథలు..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు తెలియాలని చెప్పుకొచ్చారు. 2018లోనే సైట్ విజిట్ నిబంధనను కోల్ ఇండియా తీసుకొచ్చిందని, 2021లో ఎన్ఎమ్‌డీసీ కూడా అమలు చేసిందని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 2023లో సింగరేణిలోనూ సైట్ విజిట్ కండీషన్ అమల్లోకి వచ్చిందని, సీఎమ్‌పీడీఐ డాక్యుమెంట్‌లో సైట్ విజిట్ తప్పనిసరని ఉందని చెప్పారు. 2018, 2021లో డిప్యూటీ సీఎం భట్టి లేదని, కాంగ్రెస్ లేదని ఆయన గుర్తు చేశారు. దేశంలోని పలు కేంద్ర, రాష్ట్ర సంస్థలు సైట్ విజిట్ అమలు చేస్తున్నాయన్నారు. రైల్వే, హిందుస్థాన్ కాపర్స్, గుజరాత్ ఇండస్ట్రీస్ పవర్ కంపెనీ, మహారాష్ట్ర ప్రభుత్వ టెండర్లలోనూ ఈ నిబంధన ఉందని భట్టి పేర్కొన్నారు. సైట్ విజిట్ ఎక్కడా లేదన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దురుద్దేశంతో రాసిన ఓ కథనం ఆధారంగా ఒక నేత లేఖ రాశారని, అపోహలు పెరుగుతాయని వెంటనే టెండర్లు రద్దు చేశామని భట్టి తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లకు బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిచారని, దేశంలో ఏ మైనింగ్ యాక్టివిటీలోనూ డీజిల్ సప్లయ్ చేసే పరిస్థితి లేదని చెప్పారు. 2022లో నైనీ బ్లాక్ టెండర్లలో డీజిల్ విధానం మార్చారని వెల్లడించారు. సింగరేణి 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 5 టెండర్లే జరిగాయని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు సంబంధించిన ఎవరికీ టెండర్లు రాలేదని అన్నారు. సృజన్‌రెడ్డితో సీఎంకు సంబంధాలున్నాయన్న వార్తల్లో నిజం లేదన్నారు. సృజన్‌రెడ్డి కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ అని, ఎండీ దీప్తి రెడ్డి కందాల కూతురు అని, సృజన్‌రెడ్డి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అల్లుడని భట్టి వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అసలు ఏం కావాలని, కేంద్రానికి ఎందుకు లేఖలు రాస్తున్నారని ఉపముఖ్యమంత్రి ప్రశ్నించారు. 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన అన్ని టెండర్లపై విచారణ జరపాలని తనకు లేఖ రాయాలన్నారు. తాడిచర్ల నుంచి నైనీ వరకు అన్నింటిపై దర్యాప్తు చేద్దామని అన్నారు. సీఎం రేవంత్ రాగానే చర్చించి విచారణకు ఆదేశిస్తామని చెప్పారు. తాను ఆస్తులు కూడబెట్టుకోవడానికి రాజకీయాల్లో రాలేదని, బొగ్గు బావుల్లో ఏ రాబందులను వాలనివ్వనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణకు ఆత్మగా ఉన్న సింగరేణిపై కొన్ని కట్టుకథలు వస్తున్నాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో మొత్తం 25 కాంట్రాక్టులు జరిగితే.. 20 టెండర్లు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయని మంత్రి వివరించారు.

తెలంగాణకు ఆత్మ సింగరేణి అని అన్నారు. అలాంటి సింగరేణిపై కట్టుకథలు.. కొన్ని లేఖలు.. కొన్ని రివ్యూ లు వచ్చాయని మండిపడ్డారు. 42 వేల మంది సింగరేణి ఉద్యోగుల.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 20 వేల మంది నీ మానసికంగా దెబ్బతీసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పెట్టుబడులు రాకుండా.. కట్టుకథల విషపు రాతలు.. తొలిపలుకు రాతలు.. తప్పుడు ప్రచారం.. రాష్ట్ర ప్రభుత్వం పై కావాలని కథనాలు రాస్తున్నారు.



రోజుకో కథ వండి వారిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సింగరేణికి సంబంధించిన ఆస్తుల్ని కాపాడాల్సినటువంటి వ్యక్తిగా వీటన్నింటిని చూస్తూ ఉంటే ఏ రాబందులు ఏ గద్దలు ఏ దోపిడి దారుల ప్రయోజనాల కోసమో ఈ కథనాలన్నీ వస్తున్నట్లుగా కనిపిస్తుందన్నారు.

ఇటువంటి రాతలతో తెలంగాణకు సంబంధించినటువంటి అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ పైన నిందలు మోపే క్రమంలో ఈ రాష్ట్రానికి సింగరేణికి నష్టం చేస్తున్నారన్న సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. సింగరేణి నిర్ణయం మంత్రుల దగ్గరికి రాదు.. అటానమస్ సంస్థ ఇది. మంత్రి మండలి దగ్గరకు కూడా రాదు.. ఇంగితం ఉన్న.. విజ్ఞానం ఉన్న వారు ఇలా రాయరు అని తెలిపారు. పారదర్శకంగా ఉండాలి అనుకోవడమే కాదు.. పారదర్శకంగా ఉండాలి అని వెంటనే టెండర్ రద్దు చేయాలి అని చెప్పానని అన్నారు. హరీష్ లేఖ రాయడం.. కిషన్ రెడ్డి విచారణ చేపట్టడం.. మంచిది అయ్యిందన్నారు. కిషన్ రెడ్డి చర్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం.. అడ్డగోలుగా ప్రచారం చేసే వాళ్ల బతుకు బయట పడాలని అనుకున్నానని అన్నారు.గత డాక్యుమెంట్ల ఆధారంగానే సింగరేణి టెండర్లు పిలిచింది.. నిజం ఇలా ఉంటే.. భట్టి విక్రమార్క చేసినట్టుగా కథనాన్ని వండి వార్చారని మండిపడ్డారు.

## సీఎం రేవంత్‌పై
# కేటీఆర్ అనుచిత భాష

(మొదటి పేజీ తరువాయి)

రిఫరెండం అంటున్నారు. ఇంతకు ముందు జరిగిందే ఈ ఎన్నికల్లో జరుగుతుంది. ఆనాడు సోయి లేకుండా ఇష్టం వచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేసి ఇప్పుడు అగ్నిగుండం చేస్తామని మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో ప్రజామోదంతో జిల్లాలను పునర్ వ్యవస్థీకరిస్తామన్నారు. బట్టకాల్చి మీద వేయడమే ప్రతిపక్ష పార్టీ పని అన్నట్లుగా ప్రధాన ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. మా రెండేళ్ల పాలనలో ఏ తప్పు జరిగిందని మాట్లాడుతున్నారు. వారి పాలనలో అక్రమాలు జరిగినట్లుగానే ఇప్పుడు కూడా అలాగే జరుగుతున్నాయని భ్రమపడుతున్నారు. ఇంకా అధికారంలో ఉన్నట్లుగా వారి వ్యవహార శైలిఉంది. అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్నారు. ఒక్కో అవినీతి బయటకు వస్తోందని అన్నారు. ధరణి పోర్టల్ ద్వారా భూములు కబ్జా చేసిన వారిని, రిజిస్ట్రేషన్ చలానా సొమ్ము కాజేసిన వారిని వదిలేది లేదని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు భూములు కాజేశారు. సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. అనేక అవినీతి, అక్రమాలు జరిగినట్టు నివేదికలో స్పష్టమైందని మంత్రి అననారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35 వేల లావాదేవీలు జరిగాయి. 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించాం. 9 జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు. ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా నిర్వహిస్తాం అని మంత్రి పొంగులేటి తెలిపారు.

# అందరి బాగోతాలను బయటపెడతాం..

(మొదటి పేజీ తరువాయి)

నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదిలావుంటే ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎమ్. సుభాషిని, సిఎమ్ఆర్‌వో మకరంద్, ఎసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యధాతథంగా టీ హబ్

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా నుంచి ఫోన్ చేసి సీఎం మాట్లాడారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను టీహబ్‌కు మారుస్తున్నారనే వార్తలను ఖండించారు. టీహబ్‌లో ఇతర ఆఫీసులు ఉండకూడదని ఆదేశించారు. అలాంటి ఆలోచనలు అధికారులు విరమించుకోవాలన్నారు. అద్దె భవనాల్లోని ప్రభుత్వ ఆఫీసులను ఇతర ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని సీఎం సూచించారు. టీ హబ్‌ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై ముఖ్యమంత్రి స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.

## మున్సిపల్ ఎన్నికలకు
# బిఆర్ఎస్ ఇన్‌ఛార్జ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎన్నికల వ్యూహాలను రూపొందించడం సమన్వయకర్తల ప్రధాన బాధ్యత అని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు నిరంతరం ఆయా మున్సిపాలిటీల్లో అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎన్నికల్లో అత్యంత కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ఇన్‌ఛార్జిలు కీలక పాత్ర పోషిస్తారన్న ఆయన... స్థానిక నాయకత్వంతో చర్చించి, గెలుపు గుర్రాలను గుర్తించి, నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్ఠానానికి సమర్పిస్తారని పేర్కొన్నారు. పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి అంశాలను పర్యవేక్షిస్తారని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల సరళి, క్షేత్రస్థాయి పరిస్థితిని ఎప్పటికప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించేలా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# చైనాకు బలైపోతావ్ జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)

చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరం లోనే వారు చైనాకు ఆహారమైపోతారని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు. అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగు పరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు. దీంతో, ట్రంప్ కూడా అంతేఘాటుగా స్పందించారు. ఇంతకాలం అమెరికా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గోడలెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు. మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గోడలెన్ డోమ్‌గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది.

## బండి, ధర్మపురిలకు
# కేటీఆర్ లీగల్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశం పూర్వకంగా, రాజకీయాల కోసం దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

ఈ మేరకు బండి సంజయ్, అర్వింద్‌లకు కేటీఆర్ తన న్యాయవాదులతో నోటీసులు పంపించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ ఈనెల 23న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తున్నప్పటికీ, మళ్లీ అదే తరహాలో తప్పుడు ఆరోపణలు చేయడం దురుద్దేశపూర్వకమని మండిపడ్డారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. డ్రగ్స్ సేవించడం, సరఫరా చేస్తున్నారంటూ అర్వింద్ చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా
# 18వ రోజ్‌గార్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు.

వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

## 31 నుంచి పార్లమెంట్
# బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి.

జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు.

కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.

# అమెరికా అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

విస్తీర్ణంలో ఈ తుపాను ప్రభావం చూపుతుండటంతో అగ్రరాజ్యం గజగజ వణికిపోతోంది. దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు శీతల వాతావరణం, మంచు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16కు పైగా రాష్ట్రాలు ఇప్పటికే 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ'ని ప్రకటించాయి.

ఆర్కిటిక్ ప్రాంతం నుంచి పోలార్ వోర్టెక్స్ కారణంగా దూసుకొస్తున్న అతి శీతల గాలులు, శక్తివంతమైన తుపాను వ్యవస్థతో కలవడంతో ఈ విపత్కర పరిస్థితి ఏర్పడింది. దీని ఫలితంగా దేశంలోని తూర్పు భాగమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం (ఫ్రీజింగ్ రెయిన్), స్లీట్ (మంచుతో కూడిన వర్షం)తో అల్లకల్లోలంగా మారింది. ముఖ్యంగా సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల "విపత్తు స్థాయి"లో మంచు పేరుకుపోయే ప్రమాదం ఉందని జాతీయ వాతావరణ సేవల విభాగం హెచ్చరించింది. "ఇది చాలా తీవ్రమైన తుపాను" అని యూఎస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ వాతావరణ శాస్త్రవేత్త జాకబ్ ఆషర్‌మాన్ అభివర్ణించారు.

ఈ మంచు తుపాను కారణంగా దేశవ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడింది. ఫ్లైట్ అవేర్ డేటా ప్రకారం, ఈ వారాంతంలో (శని, ఆదివారాలు) ఇప్పటివరకు 8,000కు పైగా విమానాలను రద్దు చేశారు. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ వంటి ప్రధాన సంస్థలు ప్రయాణ హెచ్చరికలు జారీ చేసి, టికెట్ మార్పు రుసుములను రద్దు చేశాయి. ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ కూడా టెక్సాస్ నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చని హెచ్చరించింది.

మంచు ప్రభావం కేవలం ప్రయాణాలకే పరిమితం కాలేదు. గడ్డకట్టే వర్షం కారణంగా విద్యుత్ తీగలపై అంగుళం మందం వరకు మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల విద్యుత్ లైన్లు తెగిపోయి, చెట్లు కూలిపోయి సుదీర్ఘకాలం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్సాస్‌లో ఇప్పటికే దాదాపు 20,000 మంది, ఓక్లహోమా, ఆర్కాన్సాస్‌లలో వేలాది మంది విద్యుత్ లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. 2021 నాటి విద్యుత్ సంక్షోభం నుంచి పాఠాలు నేర్చుకున్నామని, ఈసారి విద్యుత్ గ్రిడ్‌ను సిద్ధంగా ఉంచామని టెక్సాస్ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఫెడరల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ దాదాపు 30 సహాయక బృందాలను సిద్ధంగా ఉంచింది. ఆహారం, దుప్పట్లు, జనరేటర్లను కీలక ప్రాంతాలకు తరలించింది. పలు రాష్ట్రాల్లో నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. వాషింగ్టన్ డీసీ మేయర్ మురియల్ బౌజర్ మాట్లాడుతూ, "మేము అధికారికంగా స్నో ఎమర్జెన్సీ, స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీని ప్రకటించాం" అని తెలిపారు. చికాగోలో పాఠశాలలకు సెలవులు ప్రకటించగా, లూసియానాలో కార్నివాల్ పరేడ్‌లు, నాష్‌విల్లేలో పలు కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ తుపాను సోమవారం వరకు కొనసాగి, న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాలపై ప్రభావం చూపనుంది. తుపాను తగ్గుముఖం పట్టినా, ఆ తర్వాత కూడా అత్యంత శీతల గాలులు, ప్రమాదకరమైన వాతావరణం కొనసాగుతుందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# సింగరేణిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తర్వాత సింగరేణి బాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుంది' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతున్నారు. విచారణకు పిలిచామని సీపీ సజ్జనార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, కేసీఆర్‌లకు కాంగ్రెస్ ప్రభుత్వం క్లీన్ చిట్ ఇస్తోందా? కేటీఆర్, హరీశ్‌రావులతో సహా అందరినీ సాక్షిగా పిలిస్తే.. అసలు ఫోన్ ట్యాపింగ్ దోషులెవరు? ఫోన్ ట్యాపింగ్ దొంగలను సాక్షులుగా పిలవడమేంటి? సిట్ విచారణను ప్రత్యక్షంగా, పరోక్షంగా మంత్రులు ప్రభావితం చేసినట్లే. ఇప్పటికైనా సిట్‌కు స్వేచ్ఛనివ్వాలి. ప్రభుత్వ ఒత్తిడికి లొంగితే సిట్ అధికారులకు ఉన్న క్రెడిబిలిటీ పోతుంది. ప్రజలను దోచుకున్న కేసులన్నీ కేసీఆర్ కుటుంబానికి లొట్టపీసు కేసుల్లాగే కనిపిస్తాయి. ఎన్ని అరాచకాలు, అవినీతి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదనే ధీమా కేసీఆర్ కుటుంబంలో ఉందని విమర్శించారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను విచారణకు పిలిచి నా ఫోన్ ట్యాప్ అయ్యిందని, మావోయిస్టు జాబితాలో నా పేరును చేర్చారని చెప్పారు. మరి అందుకు కారకులైన వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు?. కాంగ్రెస్ స్కాంలు బయటపడుతున్నప్పుడల్లా ఫోన్ ట్యాపింగ్ కేసుతో డ్రామాలాడుతున్నారు. కేటీఆర్ పెద్ద నిజాయతీ పరుడిలా మాట్లాడుతున్నారు. ఎన్ని కుటుంబాలను, ఎంత మంది జీవితాలను నాశనం చేశారో తెలియదా? నిజామ్ అరాచకాలను మరువలేదు.. నీ అరాచకాలను కూడా మర్చిపోలేం. కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదు. ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్.. నా ఛాలెంజ్‌కు సిద్ధమా? దేవుడి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేసే దమ్ముందా? మావోయిస్టుల జాబితాలో హీరోయిన్లు, వ్యాపారులతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఫోన్ నంబర్లను చేర్చింది నిజం కాదా? ఆఖరికి కేసీఆర్ బిడ్డ, అల్లుడి ఫోన్లను కూడా ఆ జాబితాలో చేర్చి ఫోన్ ట్యాపింగ్ చేయించలేదా? ఇంకా సిగ్గులేకుండా దేశ భద్రత కోసం ఫోన్ ట్యాపింగ్ చేశామని చెబుతారా? నేను సవాల్ విసిరితే లీగల్ నోటీసులంటూ డ్రామాలాడతారు.

పోనీ ఆ లీగల్ నోటీసులకైనా కట్టుబడి ముందుకు సాగుతారా? అంటే.. మధ్యలోనే పారిపోతారు' అని కేంద్ర మంత్రి ఎద్దేవా చేశారు. 'రోహింగ్యాలు 2014కు ముందే పాతబస్తీలోకి అక్రమంగా ప్రవేశించారు. వారికి రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చింది కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులే. బీఆర్ఎస్ పాలనలో నాటి హోంమంత్రి.. వారికి ఇళ్లు మంజూరు చేసి మద్దతిచ్చారు. రాష్ట్ర పాలకులే ఓటు బ్యాంకు కోసం రోహింగ్యాలకు వంతపాడుతుంటే.. శాంతిభద్రతలను కాపాడేదెవరని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

తెలంగాణ రౌండప్

## మృతుల కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత





**కల్వకుర్తి, జనవరి 24 (అక్షర గళం):** కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికట్ట గ్రామంలో ఇద్దరూ మృతి చెందారు ఈ విషయాన్ని ఎల్లికట్ట గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శనివారం మృతుల కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సర్పంచ్ యాకల భీమయ్య ఉపసర్పంచ్ బలగం కేశవులు కంఠం రవి కృష్ణ ఆంజనేయులు బాలరెడ్డి సత్యం మండే శాంతి రెడ్డి చంద్రయ్య చెన్నయ్య లక్ష్మయ్య వెంకటయ్య రవి తిరుపతి రమేష్ శిశేంద్రి రాములు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లు పట్టివేత : కేసు నమోదు

**కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి**



**కల్వకుర్తి జనవరి 24 (అక్షర గళం)**

కల్వకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రఘుపతి పేట గ్రామ శివారులో దాసర్లపల్లి గ్రామం నుండి ఉప్పునుంతల మండలం నుండి అక్రమంగా ఇసుకను ప్రమాణ చేస్తున్న నాగర్ కర్నూల్ కు చెందిన నాలుగు టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి శనివారం మీడియాకు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయి..

**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి**

**ఆమనగల్లు, జనవరి 24 (అక్షర గళం):** క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయని, యువత క్రీడల్లో రాణించాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

ఆమనగల్లు మున్సిపాలిటీ లోని అయ్యప్ప కొండ ఆవరణలో జబ్బు మహేష్ జ్ఞాపకార్థం మిత్రమండలి సభ్యులు చలిచీమల సతీష్, కొమ్ము ప్రసాద్, నాగిళ్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మున్సిపాలిటీ స్థాయి టోర్నమెంట్ కు శనివారం గోలి శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఫైనల్ కు వచ్చిన రెండు జట్టులను అభినందించి పరిచయం చేసుకున్నారు. టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. ఓటమిని తొలిమెట్టుగా తీసుకుని ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ దుడ్డు ఆంజనేయులు యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, అంజీ నాయక్, ఒగ్గు మహేష్, వడ్డే రాజు, రంజిత్, సుమన్ నాయక్, పూసల భాస్కర్, జంతుక కిరణ్, విటాయిపల్లి రమేష్, మహేందర్ గౌడ్, గబ్బర్ యాదవ్, గుజ్జరి గోపి, గణేష్, శివ, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.




## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

**- ఎంపీడీఓ కుసుమ మాధురి**

**ఆమనగల్లు, జనవరి 24 (అక్షర గళం):** బాలికలు చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ కుసుమ మాధురి ఆకాంక్షించారు. శనివారం పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ కుసుమ మాధురి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో మహిళ ప్రాధాన్యతను వివరిస్తూ ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారని, ఎక్కడ పూజింపబడరో అక్కడ కార్యములన్నీ నిష్ఫలితాలని తెలిపారు. అమ్మాయిలు చదువు మధ్యలో బడి మానవేయకుండా ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కత్తి పట్టి కదనరంగంలో కాలు దువ్విన ఝాన్సీ లక్ష్మీబాయి, కలం పట్టి కదం తొక్కిన కవయిత్రులు, అంతరిక్షం దాకా వెళ్లి వచ్చిన మహిళలు, ప్రతి రంగంలోనూ దూసుకోపోతున్నారని కొనియాడారు. మహిళలు సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదుగుతూ రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులుగా ఎదిగిన వారి స్ఫూర్తితో ప్రతి విద్యార్థిని ఆదర్శ మహిళగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో పాండు, డిప్యూటీ తహసిల్దార్ వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







## కల్యాణం.. కమనీయం

**ఆమనగల్లు, జనవరి 24 (అక్షర గళం):** ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో వెలిసిన అతి పురాతనమైన అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కళ్యాణం శనివారం వేదమంత్రోచ్చారణల మధ్య కన్నులపండువగా ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను మూలవిరాట్లకు పట్టువస్త్రాలు సమర్పించి మేళ తాళాలు, భాజా భజంత్రీలతో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పొనుగోటి అర్జున్ రావు భవాని, సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య కళ్యాణంలో కూర్చున్నారు. అర్చకులు, నవీన్ శర్మ, రాజు పంతులు అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. కళ్యాణోత్సవంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కళ్యాణాన్ని తిలకించారు. ఆలయానికి విచ్చేసిన వారికి సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య, పొనుగోటి అర్జున్ రావు, ఘన స్వాగతం పలికి పూజల అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ప్రజా ప్రతినిధులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పొనుగోటి అర్జున్ రావు భవాని ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కళ్యాణోత్సవానికి గ్రామంతో పాటు పరిసరా గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, మందలమ్మ నరసింహారావు, దేవేందర్ రావు, లక్ష్మణ రావు, భాస్కరావ్, జగన్, ఆకు రాములు, శ్రీనివాస్, ఉప సర్పంచ్ కృష్ణ ప్రసాద్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## నాగిళ్ళ గ్రామానికీ బ్యాంకు మంజూరు చేయాలని వినతి

**- కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న సుభాష్**



**ఆమనగల్లు, జనవరి 24 (అక్షర గళం):** మాడుగుల మండలం నాగిళ్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఫిరోజ్ నగర్, కాట్రగాని తాండ, కొర్రతండా, దొడ్లపహాడ్ తదితర గ్రామాల ప్రజల సౌకర్యార్థం నాగిళ్ల గ్రామానికి బ్యాంకు మంజూరు చేయాలని కోరుతూ శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సురమళ్ళ సుభాష్ అధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. స్థానికంగా బ్యాంకు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గురించి కలెక్టర్ కు వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి ప్రజల అవసరాలను గుర్తించి బ్యాంకు మంజూరుకు సహకరిస్తానని తెలిపినట్లు సుభాష్ పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో అంబేద్కర్ జగ్జీవన్ రామ్ యువజన సంఘాల అధ్యక్షుడు బరిగెల రాములు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సురమల్ల చెన్నయ్య, మాజీ వార్డు సభ్యులు పులికంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### కొల్లాపూర్ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిగా ఉప్పల వెంకటేష్ పేరును

## ఖరారు చేసిన బిఆర్ఎస్ అధిష్టానం



**కల్వకుర్తి జనవరి 24 (అక్షర గళం ):** బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ను బిఆర్ఎస్ పార్టీలో కల్వకుర్తి నియోజకవర్గం లో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులను గెలిపించడంతోపాటు బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ చురుకుగా వ్యవహరిస్తున్న ఉప్పల వెంకటేష్ను అధిష్టానం పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో నేపథ్యంలో శనివారం కొల్లాపూర్ మున్సిపాలిటీకి ఎన్నికల ఇన్చార్జిగా నియమించింది ఈ సందర్భంగా కొల్లాపూర్ ఇన్ మున్సిపాలిటీ ఇన్చార్జిగా నియామకం పట్ల కల్వకుర్తి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ కొల్లాపూర్ మున్సిపాలిటీలో ఉప్పల వెంకటేష్ రాజకీయ చతురతతో కొల్లాపూర్ మున్సిపాలిటీ పై బిఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

**- ఎస్ఐ వెంకటేష్**

**ఆమనగల్లు, జనవరి 24 (అక్షర గళం):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని లెనోవా ప్రైడ్ హైస్కూల్లో వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో పాల్గొని మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి,శారీరిక ధారుఢ్యనికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ దాసరి లలిత్ కృష్ణ, ప్రిన్సిపల్ ఆర్తి నిగం, డైరెక్టర్ దాసరి విద్యా, అడ్మినిస్ట్రేషన్ రేష్మా బేగం మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే కల్వకుర్తి వ్యవసాయం మార్కెట్లో

## రికార్డు స్థాయిలో వేరుశనగకు మద్దతు ధర

**కల్వకుర్తి జనవరి 24 (అక్షర గళం):** ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే రికార్డు స్థాయిలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్లో వేరు శనగ మద్దతు ధర 11 వేళ్ళ 29 రూపాయలు పలికింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులలో ఎక్కడ లేని విధంగా కల్వకుర్తిలో శనివారం రైతులు తెచ్చిన వేరుశనగకు ఈ ధర లభించింది. వ్యవసాయ మార్కెట్కు ఒక వెయ్యి 22 బస్తాలు 34 మంది రైతులు వేరుశనగను 306 క్వింటాలు తీసుకు వచ్చారు మార్కెట్. యార్డులో గరిష్ట ధర 11029 రూపాయలు కాగా కనిష్ట ధర 8689 రూపాయలు మోడల్ ధర నిర్ణయించారు. రైతులు తాము కష్టపడి ఆరుగాలం పండించిన వేరుశనగ పంటకు ఇంత పెద్ద మొత్తంలో ధర పలకడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం పరిచారు. కల్వకుర్తి వ్యవసాయం మార్కెట్ యార్డులో ఇంతవరకు ధరను చూడలేదని అన్నారు.

### ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు

## వంట సామాగ్రి అందజేత

**కల్వకుర్తి జనవరి 24 (అక్షర గళం):** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు శనివారం వంట సామాగ్రి అందజేశారు. సేవా బృందం ఆధ్యక్షుడు శివ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల బాగు



కోసం నిత్యం సేవా బృందం అందుబాటులో ఉంటుంది, విద్యార్థులకు పౌష్టిక ఆహారం, స్వచ్ఛ ఆహారం అందుబాటులో ఉండటానికి వంట సామాగ్రి అందజేసాము అని కోరారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ విద్యార్థుల కోసం సేవా బృందం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాము అని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్ ఉపధ్యాయులు సరస్వతి, రజిత, మానస సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ బామ్మర్ది కోసమే సింగరేణి స్కామ్

- భట్టి విక్రమార్కపై పత్రికల్లో వస్తున్న కథనాల వెనుక ముఖ్యమంత్రి
- కేబినెట్ సహచరుడిపైనే లీకులు ఇప్పిస్తున్న సీఎం
- సీఎం తీరును భట్టి ఎందుకు ప్రశ్నించడం లేదు?
- భట్టి మాటలతో అది నిజమని తేలిపోయింది
- ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్



హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బామ్మర్ది సంతోషం కోసం, తన అనుయాయులకు మేలు చేకూర్చేలా భారీ కుంభకోణానికి తెరలేపారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలే ఈ స్కామ్ నిజమని నిరూపిస్తున్నాయని పేర్కొన్నారు.

కుంభకోణం నిరూపితమైంది: సింగరేణి టెండర్ల వ్యవహారంపై భట్టి విక్రమార్క చేస్తున్న సమర్థనలు చూస్తుంటే, ఇందులో భారీ స్కామ్ జరిగిందనేది స్పష్టమవుతోంది. రేవంత్ రెడ్డి తన బామ్మర్ది కళ్లల్లో సంతోషం చూడటం కోసం బొగ్గు గనులను అప్పనంగా కట్టబెట్టాలని చూశారు. టెండర్లు రద్దు చేశామని చెబుతున్న భట్టి, అసలు ఏ కారణంతో రద్దు చేయాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలి.

అంతా రేవంత్ రెడ్డి స్క్రీన్ ప్లే: భట్టి విక్రమార్కపై పత్రికల్లో వస్తున్న కథనాల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఉన్నారని శ్రవణ్ ఆరోపించారు. "భట్టిపై వార్తలు వేయించిన వ్యక్తి ఎవరు? ఆ కథ, స్క్రీన్ ప్లే మొత్తం రేవంత్ రెడ్డిదే. తన సొంత కేబినెట్ సహచరుడిపైనే లీకులు ఇప్పిస్తున్న సీఎం తీరును భట్టి ఎందుకు ప్రశ్నించడం లేదు? భట్టి ఎవరికి భయపడుతున్నారు?" అని నిలదీశారు. హరీష్ రావుపై కక్షసాధింపు: బొగ్గు కుంభకోణాన్ని ఆధారాలతో సహా హరీష్ రావు బయటపెట్టగానే, ప్రభుత్వం తట్టుకోలేక సిట్ నోటీసులతో ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. ఒకే కేసుపై రెండు సిట్లు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమని, ప్రభుత్వం నడుపుతోంది పోలీసులా లేక ప్రజాప్రతినిధులా అని ప్రశ్నించారు.

కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు: భట్టి తన 40 ఏళ్ల రాజకీయ జీవితం గురించి మాట్లాడుతున్నారు, కానీ 50 ఏళ్ల అనుభవం ఉన్న కేసీఆర్ ని సీఎం రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు తిడుతుంటే ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఎదుటివారిని గౌరవించినప్పుడే మీకు గౌరవం దక్కుతుందని హితవు పలికారు.

దోపిడీయే ఏకైక అజెండా: "తెలంగాణ రైజింగ్ – పాలన ఫాలింగ్" అన్నట్లుగా రాష్ట్ర పరిస్థితి తయారైందని శ్రవణ్ విమర్శించారు. గత రెండేళ్లలో ఒక్క విధానపరమైన పాలసీ రాలేదని, కేవలం "దోపిడీ పాలసీ" మాత్రమే నడుస్తోందని ఆరోపించారు. గాదె కింద పందికొక్కుల్లా ప్రభుత్వ ఖజానాను దోచుకుంటున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రియల్ ఎస్టేట్ మైండ్ సెట్: సీఎం రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ మైండ్ సెట్ తో పాలన సాగిస్తున్నారని, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆఫీసులను కూడా రియల్ ఎస్టేట్ ఆఫీసులుగా మారుస్తారేమో అని ఎద్దేవా చేశారు. టీ-హబ్‌ను రిజిస్ట్రేషన్ ఆఫీసుగా మార్చాలని చూడటమే అందుకు నిదర్శనమన్నారు. పదేళ్లు సీఎంగా ఉండాలని కలలు కనే రేవంత్ రెడ్డి, ఒళ్ళు దగ్గర పెట్టుకుని ప్రజల కోసం పని చేయాలని, అక్రమాలకు పాల్పడితే కాలమే సమాధానం చెబుతుందని శ్రవణ్ హెచ్చరించారు.

# ఫోన్ ట్యాపింగ్.. అత్యంత దుర్మార్గం

- ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతి?
- సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేలాల్సిందే
- ప్రజల గోప్యతను తుంగలో తొక్కిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- వ్యవస్థలను భ్రష్టు పట్టించి, రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టడం దుర్మార్గం.
- చట్టం తన పని తాను చేస్తోంది? కేటీఆర్, హరీష్ రావుల గగ్గోలు ఎందుకు?
- ధ్వజమెత్తిన మంత్రి జూపల్లి



హైదరాబాదు: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక విధానాలపై పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ప్రజా భవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "నా 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను చూశాను, కానీ ఫోన్ ట్యాపింగ్ వంటి నీచమైన రాజకీయాలను కేవలం కేసీఆర్ హయాంలోనే చూశాం" అని మంత్రి జూపల్లి విమర్శించారు. 2021 నుండి తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయని, మాజీ గవర్నర్ తమిళిసై, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ఈటల రాజేంద్ర, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ వంటి వారిపై నిఘా పెట్టారనే అనుమానాలను వారు గతంలో వ్యక్తం చేశారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన అన్నారు.

పోలీస్, ఇంటెలిజెన్స్ వంటి వ్యవస్థలను సొంత పార్టీ నేతలను, ప్రత్యర్థి పార్టీ నేతలను, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అర్ధరాత్రి తలుపులు బద్దలు కొట్టి, ప్రొఫెసర్ కోదండరాం వంటి వారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు మీ రాజకీయ విలువలు ఏమయ్యాయని మంత్రి నిలదీశారు. "మేము అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపులకు దిగలేదు. ఒకవేళ అదే మా ఉద్దేశమైతే ఎప్పుడో జైలుకు పంపేవాళ్లం. కానీ మేము చట్టాన్ని గౌరవిస్తున్నాం. కేవలం సాక్షిగా సమాచారం అడిగే సీఆర్పీసీ 160 నోటీసు ఇచ్చితేనే ఇంతలా భయపడిపోవాలా?" అని ఆయన ప్రశ్నించారు. సాక్షిగా సిట్ విచారణకు పిలిస్తే, కేటీఆర్ ఎందుకు అంతలా ఆందోళన చెందుతున్నారని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఏ విచారణకైనా సిద్ధం అని ప్రగల్భాలు పలికిన కేటీఆర్, ఇప్పుడు నోటీసులు రాగానే డ్రామాలు ఆడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం లేకపోతే, నిర్దోషులైతే భయపడాల్సిన అవసరం ఏమని ఆయన ప్రశ్నించారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత దుర్మార్గమని, ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతిని సూచిస్తుందో బీఆర్ఎస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో సిట్ దర్యాప్తులో తేలాల్సి ఉందని, నిజాలు బయటకు రావడం ఖాయమని చెప్పారు. రాజకీయ నాయకులు చట్టానికి అతీతులు కాదని, తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. ఈ విచారణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారిని కూడా సాక్షులుగా పిలుస్తున్నారని, కేవలం బీఆర్ఎస్ నేతలనే టార్గెట్ చేస్తున్నట్లు మాట్లాడటం సరికాదన్నారు.

చట్టబద్ధ సంస్థలపై బురద జల్లే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేసిన వారు ఏ పార్టీ వారైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఎప్పుడో విస్మరించారని మంత్రి అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్, హరీష్ రావు తమపై పడ్డ బట్ట కాల్చి ఇతరుల మీద వేసే పనులు మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# కొంపలు ముంచిన కేటీఆర్ నుండి సాక్షిగా వాంగ్మూలం తీసుకోవడమా?

- ఫాంహౌజ్, ఏఐసీసీ భవన్ మధ్య డీల్ కుదిరేదాకా ఈ విచారణ డ్రామా కొనసాగిస్తారా?
- సమర్థులైన సిట్ అధికారులపై అజమాయిషీ ఎందుకు?
- రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలివ్వకపోయినా...మోదీ ప్రభుత్వం ఉద్యోగాలిస్తోంది
- స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియాతో యువతను సొంత కాళ్లపై నిలబడేలా చేస్తోంది
- మీడియాతో కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో చేస్తున్న డ్రామాలతో రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ తో మంది కొంపలు ముంచిన కేటీఆర్ ను సాక్షిగా విచారణకు పిలిచి వాంగ్మూలం తీసుకోవడమే విడ్డూరంగా ఉందన్నారు. ఫాంహౌజ్‌కు, ఏఐసీసీకి మధ్య డీల్ కుదిరేదాకా ఫోన్ ట్యపింగ్ విచారణ పేరుతో డ్రామాలు కొనసాగిస్తారని చెప్పారు.

హకీంపేటలో ఫోన్ ట్యాపింగ్‌పై మీడియా అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి స్పందిస్తూ పైవిధంగా జవాబిచ్చారు. సమర్ధవంతమైన, నిజాయితీ వంతులైన అధికారులు సిట్‌లో ఉన్నారని చెప్పిన బండి సంజయ్ వారిని స్వేచ్ఛగా పని చేయనీయకుండా రాష్ట్ర ప్రభుత్వం అజమాయిషీ చేస్తూ తాను చెప్పినట్లుగా విచారణ చేయిస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఫోన్ ట్యాపింగ్ విచారణను చూసి నవ్వుకుంటున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధత తేటతెల్లమవుతోందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అల్లాడుతున్నరని, ప్రజలు అనేక సమస్యలతో అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి, కేంద్రం నిర్వహిస్తున్న ఉద్యోగాల భర్తీకి ఉన్న తేడాను గమనించాలని కోరారు.

"టీజీపీఎస్సీ అంటేనే లీకేజీలు, పైరవీలు, కోర్టు కేసులు, ఆందోళనలు, ధర్నాలతో ఏళ్ల తరబడి సాగుతున్నాయి. కానీ మోదీ ప్రభుత్వం ఒక్క పైరవీకి, అవినీతికి, లీకేజీలకు ఆస్కారం లేకుండా జాబ్ క్యాలెండర్ ఇచ్చి క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తోంది"అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేసినా చేయకపోయినా నిరుద్యోగులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం క్రమం తప్పకుండా ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలతో నిరుద్యోగులు తమ కాళ్లపై తాము నిలబడుతూ పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి తీసుకొస్తున్నారని చెప్పారు.

# స్వామి వివేకానంద ? కారల్ మార్క్స

## - ఒకరిది సామ్యవాదం.. మరొకరిది భౌతికవాదం



ప్రపంచంలో పారిశ్రామిక విప్లవం నిజంగానే ఒక విప్లవాన్ని సృష్టించింది. ఆ సమయంలోనే పాశ్చాత్య దేశాలలో జాతీయ భావాలు బలపడి జాతీయ రాజ్యాలు ఏర్పడుతున్నయి అదే సమయంలో భారతదేశంలో కూడా బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ చైతన్యం క్రమంగా బలం పుంజుకుంటున్నది .

ఆ సమయంలో అలా ఎక్కడ చూసినా జాతీయ భావాలు బలంగా వేళ్ళు ను కుంటున్నాయి ఆ సమయంలో ప్రపంచంలో ఇద్దరు గొప్ప వ్యక్తులు జన్మించారు . 19వ శతాబ్దం తొలి రోజుల్లో 1818 సంవత్సరం లో పాశ్చాత్య దేశాలలో కారల్ మార్క్స జన్మించడం. 19వ శతాబ్దం మధ్యలో ప్రాచ్య దేశమైన భారత్ లో 1863 సంవత్సరంలో వివేకానందుడిగా ప్రసిద్ధి పొందిన నరేంద్రుడు జన్మించారు.

అందులో ఒకరు మానవ చరిత్రను గతి తార్కిక భౌతిక వాద పద్ధతిలో వ్యాఖ్యానించే భావి నాగరికతను విప్లవాత్మకంగా చేసేందుకు ప్రయత్నించడం, మరొకరు భౌతిక వాద నాగరికత ఉత్థాన పతనాలను పరిశీలించి పశ్చిమ మతవ్యవస్థలను హేతుబద్ధమైన చైతన్య శీలమైన తిరుగులేని వేదాంత పు తర్కంలో విప్లవీకరించాడు.

మార్క్స తన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో లో పాశ్చాత్య ప్రపంచపు కల్లోలలోకి దూసుకుని వెళ్తే శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచంలో మాకు తిరుగులేదు. అలాగే ప్రపంచంలో క్రైస్తవానికితిరుగులేదని నిరూపించుకునేందుకు 1893 సంవత్సరంలో చికాగో లో ప్రపంచ మతమహాసమ్మేళనం అమెరికా ఏర్పాటు చేస్తే దానిలో కి దూసుకుని వెళ్లి భారతీయ వేదాంతం ఆధ్యాత్మిక జ్ఞానానికి తిరుగు లేదని నిరూపించాడు స్వామి వివేకానందుడు.

ఇరువురి ప్రయత్నాలు ప్రపంచాన్ని కుదిపేశాయి ఆ భావ జాలాలు ఈ రోజున కూడా కనపడతాయి . మార్క్స భౌతిక వాదంపై వివేకానందుని ఆధ్యాత్మికత వేదాంతం క్రమంగా ప్రపంచ స్థితిగతులను మార్చి వేస్తున్నది. మనిషి దోపిడీకి గురికావడానికి దాస్యం లోకి నెట్టబడటానికి ఆర్థిక వ్యవహారాలే కీలకమనికారల్ మార్క్స నొక్కి చెప్పాడు. వివేకానందుడు ఏ విప్లవానికైనా మానవుని నైతిక ధార్మిక ప్రవర్తనే కీలకమని చెప్పాడు.

విలువల దార్శనికతలో సమాజంలో ఉన్నత స్థితికి తీసుకుని పోలేక పోతే భౌతిక సంపద తెచ్చిపెట్టిన ప్రగతి పతనం వైపే దారితీస్తుంది అని చెప్పాడు. ఆధ్యాత్మిక శక్తి సంపద లేకపోతే భౌతిక సంపద తెచ్చిపెట్టిన ప్రగతి పతనం వైపు దారితీస్తుంది ఆధ్యాత్మిక శక్తి సంపద లేకపోతే మతం కూడా అంధకారం అయిపోతుంది.

అందుకే భౌతిక వాదానికిఆద్యాత్మికత లేకపోతే మతం కూడా అంధకారమైపోతుంది అందుకే భౌతిక వాదానికి కొనసాగింపుగా ఆధ్యాత్మికత అనేది ఎంతో అవసరం అని స్వామి వివేకానంద భావించాడు.

### వివేకానంద జన్మించిన కాలమాన పరిస్థితులు

భౌతిక వాదం విస్తరిస్తూ వెర్రితలలు వేస్తున్న సమయంలో, శతాబ్దాలుగా చెలరేగుతున్న మతోన్మాదం ఒక ప్రక్క, మరో ప్రక్క సామ్రాజ్యవాదం అటు పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి ఇటు కమ్యూనిస్టు వ్యవస్థ నుండి పెరుగుతున్న సమయంలో జన్మించిన స్వామి వివేకానందుడు తన ఆధ్యాత్మిక జ్ఞానంతో మానవ నాగరికత వికాసానికి సాంస్కృతిక జాతీయత కి బీజం నాటాడు. ఆ బీజం ఈ రోజున ఒక ఫల రూపంలో ప్రపంచమంతుట కనపడుతున్నది.

ఆధ్యాత్మికత ఈరోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. మాకు మతం వద్దు ఆధ్యాత్మిక జ్ఞానం కావాలని కోరుకునే వారి సంఖ్య ఈ రోజున ప్రపంచంలో పెరుగుతొంది .

భారతదేశంలో వేల సంవత్సరాల నుండి ఒక మనిషి జీవితానికి లక్ష్యం చతుర్విధ పురుషోర్థాలుగా చెప్పారు. అవే ధర్మం అర్థం కామం మోక్షం భౌతిక సుఖాలు సంపదలు వద్దు అని చెప్పలేదు అక్కడే మునకలు వేయకుండా సత్యాన్వేషణలో మోక్ష సాధనకు కృషి చేయాలని చెప్పారు.

ఈ క్రమంలో ఆలోచిస్తే కారల్ మార్క్స ఆర్థిక వ్యవస్థ రాజ్య వ్యవస్థ చేసే దోపిడీకి ఎదురు తిరిగి పోరాడాలని చెప్పాడు. కార్మిక నియంతృత్వం గురించి చెప్పాడు. మనిషి జీవిత సమగ్రత గురించి చెప్పలేకపోయాడు. ఆయన చెప్పిన విషయాలు ఆయన కాలంలోనే వక్రీకరణకు గురికావడం చూసి ఎంతో బాధ పడ్డాడు.

1870 సంవత్సరం చివరిలో అనేకసార్లు నేను మార్క్స ని కానీ మార్క్సిస్టు కాను అని చెప్పాడు. ఈ సమయంలో ఈ ఆలోచన నుండి పిడివాదులు తయారు కావటం బహుశా మార్క్స ని కదిలించి ఉంటుంది. అంటే తాను ప్రతిపాదించిన సిద్ధాంతము తన కాలంలోనే వక్రీకరణకు గురికావడం కారల్ మార్క్స చూశాడు.

అదే స్వామి వివేకానందుడు తన జీవితం చివరి రోజున ఈ ప్రపంచానికి వివేకా నందుడు ఏమి ఇచ్చాడు ఏమి పని చేశాడు అర్థం చేసుకోవటానికి మరో వివే స్వగతం గా పెద్దగా అనేశారు.కానంద ఉండవలసి ఉంటుంది అంటూనే రాబోవు రోజుల్లో అనేకమంది వివేకానంద లు జన్మిస్తారని

### ప్రపంచాన్ని ఆధ్యాత్మిక జ్ఞానంతో భారత్ ముంచెత్తాలి

కారల్ మార్క్స సిద్ధాంతం తో పాశ్చాత్య దేశాలలో వస్తున్న విపరిణామాలపై విశ్లేషణ చేస్తూ ఆ పరిణామాల వల్ల దానిపై జరిగే పోరాటం వల్ల వచ్చే పరిస్థితులనుండి ఈ ప్రపంచాన్ని ముందుకు తీసుకొని వెళ్లడానికి వివేకానందుడు తన ఆధ్యాత్మిక జ్ఞానంతో వేదాంతంతో ప్రపంచాన్ని చైతన్యవంతం చేయటానికి తన వంతు పాత్రను పోషించారు. అంతేకాదు ప్రపంచం ఆధ్యాత్మిక జ్ఞానంతో ముంచేత్తటానికి భారత్ సిద్ధం కావాలని ఈ దేశ యువకులకు ఉద్భోధించాడు. ప్రపంచ మత మహా సమ్మేళనం తర్వాత ఈ దేశమంతా తూఫాన్ పర్యటన చేశాడు. తన భావజాలంలో ఈ దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాడు. స్వామి వివేకానంద వారసత్వం అనే గ్రంథంలో స్వామి తపస్యానంద "అభివృద్ధి చెందినదిగా చెప్పబడు తున్న చాలా దేశాలలో జీవనశైలిలో వస్తున్న మార్పులు సుఖాల కోసం వెంపర్లాడటం వివేకానందుడు ఆమోదించలేదు.

ఆరోగ్యకరమైన సంతృప్తికరమైన జీవితం గడపటానికి కావలసిన కనీస సౌకర్యాలు అందరికీ సమకూరాలని అదే మనిషికి ఆధ్యాత్మిక సాధనకు కావలసిన వెసులుబాటు కలిగిస్తుందని మానసిక శక్తిని అందిస్తుందని వివేకానందుడు భావించాడు . అత్యధిక సంపదల వల్ల కలిగే భోగాల వల్ల గాని తీవ్ర దారిద్రం వల్ల కలిగే దైన్యం గాని లేని స్థితిలో క్షణికమైన ప్రాపంచిక సుఖ ప్రలోభల పట్ల వైరాగ్యం నిస్సంగత్వం జనిస్తాయి.

సామాజికంగా ఆర్థికంగా మద్యస్థ స్థితి వల్ల జనించే వైరాగ్యంకు ఆధ్యాత్మిక సాధనకు ప్రేరేపించగలిగే ప్రభావశీలులైన వ్యక్తులు భారతదేశంలో తయారు కావాలని అటువంటి వ్యక్తులు భారతదేశ సందేశాన్ని ప్రపంచానికి అందించగలుగుతారని చెప్పారు.

స్వామి వివేకానంద. ప్రగాఢమైన దేశభక్తి ఈ దేశం యొక్క జన సామాన్య సముద్ధరణపై ఆయన పడిన తపనలో మౌలికమైన ఆకాంక్షలను గ్రహించకుండా ఆయనను దేశభక్తిడిగానో స్వాతంత్ర యోధునిగానో మాయా ముసుగు ధరించిన కమ్యూనిస్టు మేధావి గానో భావిస్తూ వారి గురించి అపోహలు సృష్టించిన వారు కూడా ఉన్నారు.

### సామ్యవాదం - వివేకానంద, మార్క్స

వివేకానందుడు సామ్యవాదే కానీ మార్క్స లాగా భౌతిక వాది కాదు

ఈ దేశంలో సామ్యవాద భావజాలం వికాసంలో వివేకానందుని ప్రాముఖ్యతను మొట్టమొదటిగా గుర్తించిన వారు కే దామోదరం అనే భారతీయ కమ్యూనిస్టు మేధావి. "ఇండియన్ థాట్" అనే పుస్తకంలో రష్యాలో సామ్రాజ్యవాద విప్లవం రావడానికి రెండు దశాబ్దాలు ముందే వివేకానందుడు సామ్యవాద నినాదాన్ని లేవనెత్తాడు నవతరానికి ఆయన గొప్ప స్ఫూర్తి దాయకుడు అని అనటంలో ఆశ్చర్యం లేదు అని వివరించాడు.

స్వామి వివేకానంద వ్యక్తిత్వాన్ని ఆయన సందేశాన్ని సామ్యవాద దేశాలు కూడా ప్రస్తుతించయి . రష్యా చైనాలో స్వామి వివేకానంద 120 (1983)వ జయింతి అధికారపూర్వకంగా నిర్వహించబడింది. అదే సమయంలో కారల్ మార్క్స నూరవ(100) వర్ధంతి కూడా యాదృచ్ఛికంగా వచ్చింది. వివేకానంద ఆదర్శాలను ప్రస్తుతిస్తూ రష్యా చైనాలో అనేక పుస్తకాలు కూడా వచ్చాయి.

చైనా దేశ ప్రఖ్యాత చరిత్రకారుడు ప్రొఫెసర్ వన్ జోక్ సువాన్ ఆధునిక చైనాలో వివేకానందుడు భారతీయ వేదాంతిగా అత్యంత ప్రఖ్యాతుడు. వివేకానందుడు చైనా సంస్కృతి ప్రాచీన సంస్కృతిగా గుర్తించి మా దేశ ప్రజలను ప్రేమించాడు. ఆయనకు మేము సగౌరవంగా అంజలి ఘటిస్తున్నామని "భారతీయ వేదాంతనీ స్వామి వివేకానంద" అనే పుస్తకంలో వివరించాడు.

సామాజిక పరివర్తన ఇంజన్ కు తగిన ఇంధనం కావాలి ఆ ఇంధనమే వేదాంతమని వివేకానందునికి స్పష్టమైన కల్పన ఉంది. వివేకానందని సామాజిక చింతనలో మరో స్పష్టత" జాతీయ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థానంలో ఉన్న వారిని పడగొట్టడం కాదు. దిగువున ఉన్న వారిని ఉన్నత స్థితికి తీసుకుని వెళ్ళటం" సామ్యవాద భావజాలం గురించి వివేకానందనుకి ఆ స్పష్టత ఉన్నది.

అభివృద్ధికి అవసరమైన ఒకే ఒక నియమం స్వేచ్ఛ దానిని తొలగిస్తే కలిగే ఫలితం క్షీణించటం ఈ ఆలోచనలో వ్యక్తుల నిర్మాణం ఎదుగుదల ఎంతో అవసరమని వివేకానంద చెప్పకనే చెప్పాడు. మార్క్స మాత్రం భారమంత టిని కేంద్రీకృత సమాజం పైన సామూహిక జీవనం పైన ఉంచాడు. మార్క్సకు భౌతికవాదం మూలాధారము, వివేకానందునికి సత్య సిద్ధాంతమైన వేదాంతం ముఖ్యమైనది "తత్వమసి" అనే మహా వాక్యంలో అద్వైత సిద్ధాంత సారమున్నది.

అందుకే వివేకానందుడు ఈ దేశం బాగుపడాలంటే జన సామాన్యంను జాగృత పరచాలని చెప్పాడు. మన జాతి చేసిన అతి పెద్ద పాపం సామాన్య జనాన్ని నిర్లక్ష్యం చేయటం ఆ జన సామాన్యులను ఎదగనిస్తే ఈ సమాజం బాగుపడుతుంది.వాళ్లకు సకారాత్మకమైన విద్యను అందిస్తూ వాళ్లను జాగృతం చేయటం మనందరి కర్తవ్యం అని వివేకానందులు చెప్పారు . అందుకే దరిద్ర దేవోభవ అని చెప్పారు ఈ ఈ నూతన ఆలోచనలు ఈ దేశంలో గొప్ప పరివర్తనకు నాంది పలికాయని అని చెప్పవచ్చు.

### జాతీయత - మార్క్స,వివేకానందుడు

జాతీయత విషయంలో మార్క్స వివేకానంద లభిప్రాయాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. 19వ శతాబ్దంలో ప్రపంచమంతటా జాతీయ భావాలు ఉప్పొంగుతున్న కాలం . ఐరోపా ఖండంలోని వివిధ దేశాలలో జాతీయత , జాతీయ భావాలు బలపడి రాజ్య వ్యవస్థ కూడా ఏర్పడింది. భారతదేశంలో కూడా బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి దోపిడీ అణిచివేతకు వ్యతిరేకంగా జాతీయ చైతన్యం నిర్మాణం అయింది.

ఆ కాలంలో మార్క్స మాత్రం జాతీయత భావం పై అంతగా దృష్టి పెట్టలేదు బహుశా తాను భావోద్వేగా దృక్పథం జోలికి పోకుండా ఆర్థిక దృక్కోణానికి పరిమితం కావాలనుకొని మార్క్స జాతీయవాద భావాలను పూర్తిగా అవగాహన చేసుకోలేకపోయాడని చెప్పవచ్చు. 19వ శతాబ్దద్వితీయా ర్థం లో ఆ పిమ్మట ప్రపంచమంతా అనేక చోట్ల జాతీయవాదం ఒక సిద్ధాంతం గా సామ్యవాదం తో పోటీపడి తన ఆధిక్యతను విరూపించుకుంది.

ఆర్థిక శక్తులు ఆడే ఆట నుంచి జాతుల పుట్టుక ను వెతికి పట్టుకోవాల్సిందని మార్క్స అభిప్రాయపడ్డాడు. ఈ విషయంలో వివేకానందుని భావాలు ఆలోచనలు, చాలా భిన్నంగా ఉన్నాయి. వివేకానందుడు సాంస్కృతిక జాతీయతకి చాలా పెద్దపీట వేశాడు. జాతీయతకు సంస్కృతే ఆధారం. ప్రపంచంలో ప్రతి దేశం పుడుతుంది కానీ పుట్టించబడదు ప్రతి దేశం ఒక లక్ష్యాన్ని నెరవేర్చటానికి దైవ సంకల్పంతో జన్మిస్తుంది అని చెప్పారు. ప్రకృతి నియమాన్ని అనుసరించి ఆ దేశంలో జన్మించిన శ్రేష్టులైన మహాపురుషుల జీవనం ప్రేరణగా తను జాతీయ లక్ష్యాలు సాధిస్తూ ఉంటారు.

జాతి యొక్క ప్రధాన లక్ష్యం దెబ్బతిన్నప్పుడు ఆ జాతి అంతరించిపోతుంది. భారతదేశం యొక్క ప్రధాన లక్ష్యాన్ని దెబ్బతీసేందుకు కొన్ని శక్తులు బలంగా పనిచేస్తున్నాయి. భౌతిక వాద భావజాలంలో దేశ ప్రజల బుర్రల ను క్షాళన చేసి వారికి దేవుని పైన ఆత్మ పైన ఉత్తర గతుల పైన నమ్మకాలను ధ్వంసం చేయడానికి వర్గ పోరాటం పేరుతో కార్మిక వర్గ నియంతృత్వం పేరుతో హింసాత్మక చర్యలకు దేశ విద్రోహకర కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. ఇటువంటి శక్తులు పట్ల అప్రమత్తంగా ఉండి జాతీయ ఐక్యతనుకాపాడుకోవాలని వివేకానందుడు పదేపదేచెప్పేవారు.

### హిందుత్వం- మార్క్స, వివేకానంద

భారతీయుడు అనే అర్థంలో హిందువులని భారతదేశం అనే అర్థంలో హిందుస్థాన్ అని కారల్ మార్క్స మాట్లాడుతూ ఉండేవాడు. భారతదేశంలో ఏ మతానికి చెందినవాడేనా అందరూ హిందువులేనని ఒకవేళ మతాలు వేరువేరుగా చెప్పుకోవాల్సి వచ్చినప్పుడు హిందువులు ముస్లింలు అని చెప్పేవారు.

భారత దేశస్తులను ఉమ్మడి గా చెప్పవలసి వచ్చినప్పుడు హిందువులు అనే పదం వాడేవారు. ఈ దేశం యొక్క స్వాతంత్రం చాలావరకు హిందువుల పైనే హిందువుల ఐక్యత పైనే ఆధారపడి ఉందని ఒక సందర్భంలో మార్క్స అన్నారు . భారతీయులు తమ మధ్య బ్రిటిష్ నూతన సామాజిక శక్తుల ప్రయోజనాన్ని పొందాలంటే అది ఘనత వహించిన బ్రిటన్ కు కొత్త పాలకవర్గాల స్థానంలో పారిశ్రామిక వర్గాలు వచ్చేవరకు వేచి ఉండాలి. లేదా హిందువులు బలపడి ఆంగ్లేయుల పెత్తనాన్ని ఏక మొత్తంగా తొలగించి స్వతంత్రులు కావాలి. ఉన్నతమైన ఆసక్తికరమైన భారతదేశం యొక్క పునరుజ్జివనం సమిప భవిష్యత్తులో చూడగలం. సాధు స్వభావులైన ఆ దేశ ప్రజలలో నిమ్న వర్గాలు కూడా ఇటు ఇటాలియన్ల కన్నా సూక్ష్మ బుద్ధులు చురుకైనవారు . వాళ్ళ విధేయత కూడా ప్రశాంతమైన ఔన్నత్యంతో కూడుకొని ఉంటుంది.

సహజంగా మందకొడి తనం ఉన్నప్పటికీ వాళ్లు తమ సాహస పరాక్రమాల ద్వారా బ్రిటిష్ అధికారులను నివ్వెరపరచారని మార్క్స వివరించాడు . హిందుత్వంపై స్వామి వివేకానంద "గర్వ సే కహో హమ్ హిందూ హై" అని చెప్పాడు. అంటే నేను హిందువునని గర్వంగా చెబితే వేల సంవత్సరాల మనచరిత్ర మన మహా పురుషుల పరంపర చరిత్ర సంస్కృతి మనకు గుర్తుకు వస్తాయి. హిందుత్వాన్ని సమరశీలంగా చేయటమే నా జీవన లక్ష్యం అని చెప్పారు.

సనాతన ధర్మం పాటించబడాలి అని చెప్పేవారు. ప్రస్తుతం మనకు ముంచుకుని అతి పెద్ద ముప్పు ఇతర మతాలవాళ్ళు హిందువులను మతం మార్చటం దానివల్ల హిందువుల సంఖ్య క్షీణించబడుతున్నది చాలావరకు దానికి మన చట్టాలు కూడా దోహదం చేస్తున్నాయి. మన మొదటి తక్షణ కర్తవ్యం మతం మార్పిడులు ఆగిపోయేటట్లు చేయటం. హిందూ ధర్మంలోకి తిరిగి రాదలచు కొన్న వారిని గౌరవంగా స్వాగతించాలి . మన పొరపాటులను సరిచేసుకొని ఒక నూతన శక్తిని నిర్మాణం చేయాలి అని వివేకానంద చెప్పేవారు. వ్యక్తి నిర్మాణమే సాంస్కృతిక జాతీయతకుపునాది అని చెప్పాడు.

ముగింపు: స్వామి వివేకానందుడు హిందూ సమాజ పునరుజ్జీవననికి సాంస్కృతిక జాతీయతను శక్తివంతం చేయడము హిందూ సమాజం సామాజికంగా శక్తివంతంగా ఉండటానికి కృషి చేసేవారు. వివేకానందుడు ఒక ఆధ్యాత్మికవేత్త ఒక దార్శనికుడు ఒక సామాజిక పరివర్తకుడు.

వివేకానంద భావజాలంలో సాగుతున్న జాతీయ పునర్ నిర్మాణ కార్యంలో మనమందరం పాల్గొని వివేకానందుడుకలలు కన్నాభారతాన్నిసాకారం చేద్దాము ఆ సంకల్పమే ఈ జాతికి శ్రీరామరక్ష.

గడిచిన వంద సంవత్సరాలకు పైగా కమ్యూనిజం ,పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచాన్ని ఎలా శాసించారో చరిత్రలో చూస్తున్నాము. అయితే అంతిమంగా ఆధ్యాత్మిక విప్లవమే ప్రపంచ శాంతికి మూలం.



తెలుగు దిన పత్రిక https://aksharagalam.com
# అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్


## విద్యార్థులకు టై, బెల్టులు అందజేత




**యాచారం, అక్షరగళం:** మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బ్యాచ్, బెల్టులను గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపసర్పంచ్ మధుకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బాలరాజ్ గౌడ్, ఆడాల గణేష్, జంగారెడ్డి తదితరులున్నారు.

# నిరుద్యోగయువత కష్టపడి చదవి ఉద్యోగం సంపాదించాలి

### భారత ప్రభుత్వ హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి:** భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తుందని, నిరుద్యోగయువత కష్టపడి చదవి ఉద్యోగం సంపాదించాలని భారత ప్రభుత్వ హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని హకీంపేట్ లో గల నేషనల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటి అకాడమి అథారిటిలో ఏర్పాటు చేసి రోజ్‌గార్ మేళా కార్యక్రమం కింద నియమితులైన యువతకు నియామక పత్రాలను అందించే కార్యక్రమంలో ఎన్ఐఎస్ఎ డైరెక్టర్ డిపి.పరిహార్, డిప్యూటి డైరెక్టర్ అనీల్ దాము లతో కలిసి సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా సహాయ మంత్రి మాట్లాడుతూ ఉద్యోగ ప్రక్రియలో ఎక్కడ ఎలాంటి అవినీతికి తావు లేదని కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచనలు చేస్తూ, కేవలం జీతం కోసం కాకుండా దేశం, సమాజ సేవకు అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ వేదిక ఒక భరోసా, భవిష్యత్తులో ఉద్యోగం కల్పింస్తుందనడానికి ఏలాంటి సందేహం లేదన్నారు. విశ్వగురు స్థానంలో భారత దేశాన్ని నిలపాలనేదే



ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని అన్నారు. వికసిత భారత్ ఏ2047" లక్ష్యంతో భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని, ఆ లక్ష్య సాధనలో కొత్త ఉద్యోగులు నిరంతర భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగమే సాంధించాలనే ధృక్పదంతో కాకుండా, ఉపాధి



సృష్టికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రధాన మంత్రి సంకల్పానికి అనుగుణంగా, రోజ్‌గార్ మేళా ఈ దృక్పథాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చే ముఖ్యమైన కార్యక్రమంగా నిలుస్తోందన్నారు.

దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో 61 వేల మంది కొత్తగా నియమితులైన ఉద్యోగులకు నియామక పత్రాలు అందించే ఉద్దేశంతో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఎస్ఎ లో మొత్తం 238 మంది అభ్యర్థులు నియామక పత్రాలు స్వీకరించారు.

ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా రోజ్‌గార్ మేళాలను ఉద్దేశించి ప్రసంగించారు. ముందుగా భారత ప్రభుత్వ హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.



## అక్రమ చొరబాట్లపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

**అక్షరగళం, కూకట్‌పల్లి:** దేశ భద్రత, రాష్ట్ర శాంతి, హిందూ ధర్మ రక్షణకు ముప్పుగా మారుతున్న అక్రమ చొరబాట్లపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సూచించారు. జాగో భాగ్యనగర్ – చలో బాలాపూర్" అనే నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు నిజాంబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి భూమండల జీవన్ , మోహిత్ తో కలిసి జెండా ఊపి బాలాపూర్‌కు బయలుదేరిన బస్సులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ భాగ్యనగరాన్ని అసాంఘిక శక్తుల నుండి రక్షించుకోవాలంటే ఇలాంటి ఉద్యమాలు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన రోహింగ్యా చొరబాటుదారులను దేశం నుంచి పూర్తిగా తిరిగి పంపే వరకు నిరంతరంగా పోరాడి భాగ్యనగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వయంగా బస్సులో ప్రయాణిస్తూ బాలాపూర్‌లో నిర్వహించనున్న ధర్మ రక్షణ సభకు బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తూము శైలేష్ కుమార్, చంద్రశేఖర్ గుప్తా, పిట్లమనోహర్ కార్యకర్తలు, హిందూ సంఘాల ప్రతినిధులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు.



## వాకింగ్ ట్రాక్ అతి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం..

### శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**అక్షర గళం, శేరిలింగంపల్లి:** హఫీజ్‌పేట్ కాయిదమ్మ కుంట చెరువు, వాకింగ్ ట్రాక్ అతి త్వరలో అందుబాటులోకి తీసుకవస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా స్థానికుల కలగా ఉన్న హఫీజ్‌పేట్ కాయిదమ్మ కుంట చెరువు సుందరీకరణ ప్రాజెక్ట్ తుది దశకు చేరుకుంది. ఇంచార్జ్ చైతన్యా, గౌతమ్ గౌడ్ విశేషమైన కృషి శ్రమతో ఈ ప్రాజెక్ట్ వేగంగా పూర్తవుతోంది. కాలనీవాసులు, గ్రామస్తుల ఆరోగ్య, వినోద అవసరాల కోసం ఒక ఆధునిక వాకింగ్ ట్రాక్ నిర్మించబడింది.ఈ అభివృద్ధి పనులు భూగర్భ జలాల పునరుద్ధరణకు , స్థానిక జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్ట్ ప్రారంభ తేదీ, సమయ వివరాలు అతి త్వరలోనే అధికారికంగా ప్రకటించబడతాయని తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల పాలిటవరం

### మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల పాలిటా వరమని నిజాంపేట్



మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద మంజూరు చేయించిన రూ. 2,00,000విలువైన ఎల్ఓసి చెక్కును శనివారం బాధితులు చింతల శ్రీనివాసరావు కు ఆయనతో పాటు నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్‌లు పాల్గొని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ, బంటి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తా..

### అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**అక్షర గళం, శేరిలింగంపల్లి:** కాలనీలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హామీ ఇచ్చారు. అల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని జన్మభూమి కాలనీ లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు , కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జన్మభూమి కాలనీలో కొంతమేర డ్రైనేజీ , సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీ లో కొన్ని చోట్ల విద్యుత్ స్తంబాలు కావాలని కాలనీ వాసులు కార్పొరేటర్ కి తెలియచేయగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే కరెంటు పోల్స్ అమర్చి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, బోయ కిషన్, గోపాల్, పోశెట్టి గౌడ్, రెహ్మాన్, గోపి, గురుమూర్తి, కుమార్, తిరుపతి, మల్లేష్, నాగేష్, షేక్ షా వలి, గౌస్, నరసింహ రాజు, పెంటయ్య, బాలకృష్ణ, శేఖర్, ఆంజనేయులు, చందు, లాలు, గౌడ్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, రవీందర్, ఖలీమ్. జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యుబీడి నాగరాణి, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి , మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### చిత్తారమ్మ జాతర

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**అక్షర గళం, కుత్బుల్లాపూర్:** హైదరాబాద్ నగరంలో అంగరంగ వైభవంగా నిర్వహించే జాతర్లలో ఒకటైన గాజులరావారం చిత్తారమ్మ దేవి జాతర ను పురస్కరించుకొని సీనియర్ నాయకులు తెలంగాణ సాయి ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన వాల్ పోస్టర్ ను శనివారం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, దుండిగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ శంభీపూర్ కృష్ణ లు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి జాతరను ఎలాంటి అవంచానీయ సంఘటనలు చోటు చేసుకోకుండ ఘనంగా నిర్వహించాలన్నారు. అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు





# కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండ

**సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్**

**నర్సింహ్మా కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత**

యాచారం, అక్షరగళం: కార్యకర్త నర్సింహ్మా కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మేడిపల్లి నక్కర్త గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. ఇటీవల కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన నరసింహ్మా కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతుడి కుటుంబా ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సేకరించిన లక్ష రూపాయల నగదును పెద్ద కురుమ కలకొండ బీరప్పతో కలసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పార్టీ మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. పిల్లల ఉన్నత చదువులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధుకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎరుకలి బాలరాజ్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం, చిగురంతా సికిందర్ రెడ్డి, ఏవిజి ఫౌండేషన్ చైర్మన్ ఆడాల గణేష్, పార్టీ ఉపాధ్యక్షులు జమ్మ గుండాలు, వార్డు సభ్యులు మక్కపల్లి మహేష్, ముచ్చర్ల ప్రకాష్, బన్ని జంగయ్య, బేత జంగయ్య, గడ్డం మల్లేష్, కలకొండ మల్లేష్, బండ రాజు, ఏరకలి కృష్ణ, జమ్మ శివ, మొరుగు మహేష్, బండ బీరప్ప, పోలే జంగయ్య తదితరులున్నారు.

# అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

యాచారం, అక్షరగళం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో టిజీఐఐసి నిధులతో వైకుంఠధామం నుండి ఊరి చివర వాటర్ ట్యాంక్ వరకు అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు పాలకవర్గ సభ్యులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... సమస్యలను దశల వారీగా పరిష్కారించి, అందరి సహకారంతో గ్రామాన్ని మండలంలోనే ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనేమోని రవీందర్, వార్డు సభ్యులు గోపలి కల్పన మహేందర్, నీలం లక్ష్మీదేవి, నీలం విజయలక్ష్మి, జంగిలి రమేష్, సముద్రాల ప్రవీణ్, మడ్డి సురేష్ తదితరులున్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

యాచారం, అక్షరగళం: మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామానికి చెందిన కందడి నర్సింహ్మా ఇటీవల కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని అండగా మేమున్నామంటూ గ్రామస్థులు, స్నేహితులు ఒక లక్ష అరవై నాలుగు వేల



సేకరించిన నగదును నర్సింహ్మా కుమార్తె పేరున పోస్ట్ ఆఫీస్‌లో ప్రధానమంత్రి సుకన్య యోజన పథకం కింద జమచేసిన పత్రాలను శనివారం వారి కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరిక

అక్షర గళం, కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాయని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. శనివారం



బాచుపల్లిలోని ఆయన కార్యాలయంలో కొలను సమక్షంలో పండగ వెంకటేష్ ముదిరాజ్, శ్రీకాంత్ గౌడ్ లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి, సాదు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, శివారెడ్డి, నరసింహారెడ్డి, రాజు చారి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో ఫర్నీచర్ స్టాక్

**అందుకే మంటలు ఆర్పడానికి ఇబ్బందులు - అగ్నిప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్**

హైదరాబాద్: తీవ్ర కలకలం రేపిన నాంపల్లి ఫర్నిచర్ షాపు అగ్నిప్రమాదంపై ఫైర్ డీజీ విక్రమ్ సింగ్ మాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారంమీడియాతో మాట్లాడుతూ.. ఇది చాలా పెద్ద ప్రమాదమని.. మంటలు అదుపు చేయడం చాలా కష్టంగా మారిందని అన్నారు . ఫైర్ సిబ్బంది, రెస్క్యూ టీమ్స్ చాలా కష్టపడి మంటలను అదుపులోకి తెచ్చాయని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ లో మొత్తం స్టాక్ స్టోర్ చేశారని ప్రమాద తీవ్రత పెరగడానికి ఇదే కారణమని విక్రమ్ సింగ్ మాన్ అన్నారు. బేస్మెంట్ 1,2 పార్కింగ్ కోసం ఉపయోగించాలి..కానీ బిల్డింగ్ యాజమాన్యం నిబంధనలను పాటించలేదని అన్నారు. తమతో పాటు ఎన్డీఆర్ఎఫ్ కూడా సహాయక చర్యలో పాల్గొంటుందని..మరో రెండు గంటలో రేస్క్యూ పూర్తి అయ్యే అవకాశం ఉందని అన్నారు. బస్మెంట్ లోనికి వెళ్ళడానికి మార్గం లేదని.. అదుకే ఆలస్యమైందని అన్నారు. బేస్మెంట్ లోకి వెళ్లేందుకు మార్గం లేకపోయినా డ్రిల్ చేసుకుంటూ బ్రేక్ చేసి వెళ్తున్నామని అన్నారు. రెస్క్యూ ఆపరేషన్ ప్రమాదం గురించి పూర్తి సమాచారం తెలియజేస్తామని అన్నారు విక్రమ్ సింగ్ మాన్. ఇదిలా ఉండగా.. సెల్లార్ లో చిక్కుకున్నవారిని బయటికి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు.



# కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజుకు బీఆర్ఎస్ శ్రేణుల అపూర్వ స్వాగతం

కొత్తగూడెం: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు చేరుకున్నప్పుడు బీఆర్ఎస్ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు.ఎంపీ రవిచంద్ర తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్ నుంచి ఖమ్మం ఆ తర్వాత కొత్తగూడెం విచ్చేయగా, పోస్టాఫీసు సెంటరులో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు, ఆయన కుమారుడు రాఘవ, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ తదితర ప్రముఖులు భారీ క్రేన్ సాయంతో గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఊరేగింపుగా పార్టీ జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్ చేరుకున్నారు.

ఎంపీ రవిచంద్ర జన్మదినం సందర్భంగా పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్వర రావు, రాఘవ తదితరులు ఎంపీ రవిచంద్ర చేత భారీ కేక్ కట్ చేయించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజును పార్టీ నాయకులు కనకేష్ పటేల్,రాజు గౌడ్, కాపు కృష్ణ, నవతన్, డిష్ నాయుడు, శాంతినాయక్, అన్వర్ పాషా, చందు నాయక్, గోవాడ గుణచరిత్ తదితరులు శాలువాలతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# షిరిడీ సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు తగదు

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు**

హైదరాబాద్, (అక్షర గళం): ఇటీవల కొంతమంది షిరిడీ సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, భక్తులను కించపరిచేలా దుర్భాషలాడిన ఘటనలను రెండు తెలుగు రాష్ట్రాల షిరిడీ సాయి భక్త సంఘాల ప్రతినిధులు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని పరిశీలించిన అనంతరం ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. షిరిడీ సాయిబాబాపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఇటువంటి వ్యాఖ్యలు పార్టీ సిద్ధాంతాలు, విధానాలకు పూర్తిగా విరుద్ధమని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ సమాజంలో ఐక్యత, మతసామరస్యం, దేశభక్తిని పెంపొందించే విధంగా పనిచేస్తుందని, వ్యక్తుల మధ్యా, ప్రాంతాల మధ్యా విభేదాలను ఎప్పటికీ ప్రోత్సహించదని తెలిపారు.

భవిష్యత్తులో బీజేపీ పార్టీలోని ఎవరూ భక్తుల హృదయాలను గాయపరిచే వ్యాఖ్యలు చేయకుండా, సమాజంలో వివాదాలకు తావు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటామని షిరిడీ సాయిబాబా భక్తులకు రాంచందర్‌రావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా షిరిడీ సాయి భక్త సమాజాల ప్రతినిధులు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఆయనకు సాయిబాబా ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సాయిబాబా దేవాలయాల నుంచి రాజవర్ధన్, మంచికంటి ధనుంజయ, గుండా మల్లయ్య, మైనంపాటి ప్రసాద్, పి.వి.సాయి, భాను ప్రతాప్, సాయి శ్రీనివాస్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# అయోధ్య రాముడికి కోదండం

రాముడు కోట్లాదిమంది ఆరాధ్యదైవం. ఆయన ఆయుధం కోదండం. శ్రీరాముడి కోదండం ఆయన అధికారం, బలంకు చిహ్నం మాత్రమే కాదు...మర్యాదకు, త్యాగం, న్యాయబద్ధమైన అంశాల సందేశం కూడా.

శ్రీరాముని జన్మ స్థలమైన అయోధ్యకు శ్రీరాముని కోసం తయారు చేయించిన 286 కిలోల బరువు ఉన్న పంచలోహ కోదండం చేరుకుంది. ఈ నెల 3న ఒరిస్సా నుంచి శోభాయాత్రగా సనాతన జాగరణ్ మంచ్ రూర్కెలా శోభాయాత్ర నిర్వహిస్తూ అయోధ్యకు కోదండంను తీసుకువచ్చింది. అంతకు ముందు బంగారం, వెండి, అల్యూమినియం, జింక్, ఇనుము మొత్తం ఐదు లోహాలు వాడి తయారు చేయించిన కోదండంకు పూరిలో భగవాన్ జగన్నాథుని దర్శనం చేయించారు. శిల్పకారులు 8 నెలలపాటు తమిళనాడులోని కాంచీపురంలో శ్రమించి తయారుచేసిన కోదండం పై కార్గిల్ యుద్ధం, భారతీయ సైన్యం వీరత్వం, పరాక్రమ విజయాలు చెక్కారు.

శ్రీరాముడి మార్గాన్ని ఆచరించే కోట్లాది మందికి ఈ కోదండం సైతం ఎల్లప్పుడు ధర్మం, న్యాయం, మర్యాదలను పాటించాలనే సందేశాన్ని పంచుతుంది.



# అబ్బే.. నేను సజ్జన్నార్‌ను అట్లనలే!


**- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపిఎస్ ఆర్.ఎస్.ప్రవీణ్ యుటర్న్**

**- మీడియా వార్తలపైనే వ్యాఖ్యానించానంటూ వివరణ**

**- నైతికత గురించే మాట్లాడానని సమర్థించుకునే ప్రయత్నం**

**- ప్రవీణ్ వ్యాఖ్యలపై నోటీసులిచ్చిన సజ్జన్నార్**

హైదరాబాద్: సీనియర్ ఐపిఎస్ సజ్జనార్‌పై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయంటూ వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపిఎస్ ఆర్.ఎస్.ప్రవీణ్ పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఒక్కసారిగా స్వరం మార్చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ చీఫ్ సజ్జనార్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేసిన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చిక్కుల్లో పడ్డారు. ఆరోపణలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లతో సహా పూర్తి వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించడంతో ప్రవీణ్ కుమార్ ఆత్మరక్షణలో పడ్డారు. తాను సజ్జనార్‌పై కేసులు ఉన్నాయని అనలేదని, కేవలం నైతికత గురించే మాట్లాడానని ప్రవీణ్ కుమార్ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసిన సజ్జనార్, ఫోన్ ట్యాపింగ్ విచారణకు నేతృత్వం వహించడం



సమంజసం కాదని మాత్రమే తన అభిప్రాయాన్ని చెప్పానంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అయితే, ప్రెస్ మీట్ పెట్టి మరీ క్రిమినల్ కేసులు ఉన్నాయని నొక్కి చెప్పిన ఆయన, ఇప్పుడు కేవలం పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగానే మాట్లాడానని చెప్పడం గమనార్హం.

# హ్యాట్సాఫ్ మోదీజీ!

**- పైరవీలు, లీకేజీలు, లంచాలకు తావులేకుండా ఉద్యోగాల భర్తీ చేస్తున్న ఘనత మోదీదే**

**- గత మూడేళ్లలో 11 లక్షల ఉద్యోగాల భర్తీ**

**- నేడు 61 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయడం గొప్ప విషయం**

**- డబ్బుల్లేక అర్ధాకలితో చదువుకుంటున్న బాధలు ప్రధానికి తెలుసు**

**- రోజ్ గార్ మేళా మోదీకి ఇష్టమైన కార్యక్రమం**

**- ఉద్యోగులారా.... మీ బాధ్యతను విస్మరించొద్దు**

**- ఎవరో మాటలు విని సమ్మె చేస్తే నష్టపోతారు**

**- నిరుద్యోగులారా...నిరాశ పడకండి**

**- హైదరాబాద్ హకీంపేట "రోజ్ గార్ మేళా"లో కేంద్ర మంత్రి బండి సంజయ్**

**- దేశవ్యాప్తంగా 61 వేల మందికి ఉద్యోగ నియమాక పత్రాల అందజేత**

హైదరాబాద్: ఏ చిన్న అవినీతికి, పొరపాట్లకు, పైరవీలకు తావులేకుండా నిరంతరం జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి ఠంచన్ గా లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానికి దక్కుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు.

"గతంలో ఏ ప్రభుత్వమూ ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసిన దాఖలాల్లేవ్. అవినీతి, అక్రమాలు, పైరవీలు లేకుండా గత పాలకులు ఉద్యోగాల భర్తీ చేయలేదు. భవిష్యత్తులోనూ చేస్తారనే నమ్మకం లేదు. ఆ క్రెడిట్ మోదీకే దక్కుతోంది. ఒక్క రోజ్ గార్ మేళానే కాదు, కేంద్రంలోని అన్ని విభాగాల్లోనూ అవినీతికి తావు లేకుండా గత 11 ఏళ్లుగా అద్భుతమైన పాలన కొనసాగిస్తున్న మహానేత మోదీజీ... హ్యాట్సాఫ్ మోదీజీ"అని కొనియాడారు. హైదరాబాద్ లోని హకీంపేట సీఐఎస్ఎఫ్ నిసా అంతరిక్ష ఆడిటోరియంలో నిర్వహించిన "18వ రోజ్ గార్ మేళా"కు కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐఎస్ఎఫ్ నిసా ఐజీ డీపీ పరిహార్, డీఐజీ అనిల్ డామోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్ తన చేతుల మీదుగా 61 మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా సంజయ్ ఏమన్నారంటే.. ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అత్యంత ఇష్టమైన కార్యక్రమం "రోజ్ గార్ మేళా". 2022 అక్టోబర్ నుండి ఇప్పటి వరకు 17 రోజ్ గార్ మేళాల ద్వారా 11 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఈరోజు నిర్వహించే 18వ రోజ్ గార్ మరో 61 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వబోతున్నం. చాలా సంతోషంగా ఉంది. యువతపై మోదీకి ఉన్న అభిమానానికి ఇది నిదర్శనం.



ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ నిరాశ, నిస్ప్రుహలతో బాధపడుతున్న యువతకు ఈ వేదిక ద్వారా భరోసా ఇస్తున్నాం. కష్టపడి ప్లాన ప్రకారం చదివితే వాళ్లకు సైతం ఉద్యోగాలు వస్తాయి. రోజ్‌గార్ మేళా ఒక రోజుతో ముగిసేది కాదు. నిరంతర ప్రక్రియ. ప్రతి మేళా వేల కుటుంబాల్లో వెలుగు నింపుతోందనే విషయాన్ని గుర్తుంచుకోండి.

నిరుద్యోగం ఎంత దారుణంగా ఉంటుందో, నిరుద్యోగుల పరిస్థితి ఎంత దుర్భరంగా ఉంటుందో నేను కళ్లారా చూసిన. హైదరాబాద్ అశోక్ నగర్ లోని సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగుల పడుతున్న బాధలను, ఆకలి బాధలను చూసిన. డబ్బులు లేక ఒకే పూట తిండి తింటూ ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది తినడానికి డబ్బుల్లేక 2 అరటి పండ్లు తిని కడుపు నింపుకున్న ద్రుశ్యాలు చూసిన. మోదీకి ఇవన్నీ తెలుసు. కాబట్టే రోజ్ గార్ మేళా పేరుతో ఏ చిన్న అవినీతికి, పొరపాట్లకు తావులేకుండా నిరంతరం జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి ఠంచన్ గా లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. ఇది మామూలు విషయం కాదు. మోదీ ప్రభుత్వానికి ఆ ఘనత దక్కింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేసిన దాఖలాల్లేవ్. అవినీతి, అక్రమాలు, పైరవీలు లేకుండా గత పాలకులు ఉద్యోగాల భర్తీ చేయలేదు. భవిష్యత్తులోనూ చేస్తారనే నమ్మకం లేదు. ఆ క్రెడిట్ మోదీకే దక్కుతోంది. ఈ రోజ్ గార్ మేళానే కాదు, అవినీతికి తావు లేకుండా గత 11 ఏళ్లుగా అద్భుతమైన పాలన కొనసాగిస్తున్న మహానేత మోదీజీ... హ్యాట్సాఫ్ మోదీజీ...

ఇక్కడున్న తల్లిదండ్రులు పిల్లల కోసం ఎన్నో కష్టాలు పడి ఉంటారు. ఫీజులు, కోచింగ్ ల కోసం అప్పులు తెచ్చి మరీ ఫీజు చెల్లించి ఉంటారు. నిన్నటిదాకా నా బిడ్డకు ఉద్యోగం వస్తుందా? అని దేవుడిని మొక్కుకుని ఉంటారు.. ఇయాళ మీ ఆశలు నెరవేరాయి. అందుకే మీ కళ్లల్లో ఆనందం కన్పిస్తోంది. ముఖంలో గర్వం కన్పిస్తోంది. మీ పిల్లల కోసం మీరు పడిన కష్టానికి, త్యాగానికి వచ్చిన ఫలితమిది. అందుకే మీ అందరికీ హ్యాట్సాఫ్...

నిన్నటి వరకు మీరంతా నిరుద్యోగులు. ఏం చేస్తున్నారని ఎవరైనా అడిగితే ఏం చెప్పాలో తెలియక మానసికంగా ఇబ్బంది పడి ఉంటారు. కానీ ఈరోజుతో ఆ బాధ పోయింది. ఈరోజు నుండి మీరంతా సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయి నని గర్వంగా చెప్పుకోగలరు. అయితే ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం మాత్రమే కాదు. పెన్షన్ మాత్రమే కాదు. ప్రజలకు సేవ చేయడం, దేశానికి సేవ చేయడం. మీ జీవితం ఇక్కడితోనే ఆగిపోకూడదు. పోస్ట్‌మాన్ స్థాయి నుండి ప్రొఫెసర్ స్థాయివరకు మీరు ఏ ఉద్యోగంలో ఉన్నా సరే మీకు అప్పగించిన పనిని సక్రమంగా, నిజాయితీతో ఇష్టపడి చేసి మంచి గుర్తింపు తెచ్చుకోండి. ఎప్పటికప్పుడు కొత్తగా వచ్చే టెక్నాలజీని, ఉద్యోగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగండి. ఎవరో చెప్పిన మాటలు విని సమ్మె చేస్తే నష్టపోతారు. గతంలో పోస్టల్ డిపార్ట్ మెంట్ ద్వారా వేలాది మందికి ఉద్యోగాలిస్తే... తెలిసీ తెలియక ఆ పోస్టల్ ఉద్యోగులంతా చెప్పుడు మాటలు విని సమ్మె చేస్తే మోదీ ప్రభుత్వం ఒక్క నోటీస్ తో 25 వేల మందిని సస్పెండ్ చేశారు. సేవ చేయాల్సిన ఉద్యోగులు తెలిసీ తెలియక సమ్మెల పేరుతో ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తానంటే, ఆ శాఖకు నష్టం చేస్తామంటే ఊరుకునే ప్రభుత్వం మోదీది కాదు.

వాస్తవాలను అర్ధం చేసుకున్న పోస్టల్ ఉద్యోగులు నా వద్దకు వచ్చి తెలిసీ తెలియక ఎవరో చెబితే సమ్మెలో పాల్గొన్నామని, పొరపాటైందని చెబితే...నేనే కేంద్ర మంత్రితో మాట్లాడి ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయించిన. దయచేసి ఎవరో ఏదో చెప్పారని, మీ ఉద్యోగ ధర్మాన్ని, బాధ్యతను విస్మరించవద్దని కోరుతున్నా. ఎన్నికల హామీతో పని లేకుండా నిరంతరం ఉద్యోగాలను భర్తీ చేస్తూ నిరుద్యోగులకు భరోసా ఇస్తున్న ప్రభుత్వం నరేంద్రమోదీది. అందుకే దేశ ప్రజలు వరుసగా మూడుసార్లు అధికారాన్ని అప్పగించారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రమం తప్పకుండా వివిధ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేస్తూ లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. అంతేగాదు స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా పేరుతో ఉద్యోగాలు చేసే స్థాయి నుండి ఉద్యోగాలు స్రుష్టించే స్థాయికి మన భారతీయ యువతను ప్రోత్సహిస్తున్నారు. కరోనా హయాంలో అమెరికాసహా ప్రపంచమంతా ఆర్ధిక సంక్షోభంలో కూరుకుపోతే ఆత్మ నిర్భర్ ప్యాకేజీతో భారత్ ను ఆర్ధికంగా స్థిరంగా ఉంచిన ఘనత మోదీ ప్రభుత్వానిదే.

అంతేగాకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ ఆర్ధిక ప్రగతిలో అగ్రభాగాన నిలిచేందుకు నిరంతరం క్రుషి చేస్తున్నారు. గతంలో 11వ స్థానంలో ఉన్న భారత్ ను 4వ స్థానంలో నిలిపారు. త్వరలోనే 3వ స్థానానికి తీసుకువచ్చే దిశగా పనిచేస్తున్నారు. భారత్ కు స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి 100 ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా అప్పటికి అమెరికా, చైనాను అధిగమించి భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ గా మార్చి 'విశ్వగురు' స్థానంలో నిలపాలన్నదే మోదీగారి ఆకాంక్ష. ఈ యజ&ఝంలో మీరంతా భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా.

# 2026 ఫిబ్రవరి 17 వరకు పెళ్లిళ్లకు ముహూర్తాలు లేనట్లే..!



పెళ్లి అంటేనే నూరేళ్ల పంట. అలాంటి వివాహాది శుభకార్యాల చేసేందుకు శుభ ముహూర్తం చాలా అవసరం. శుభ ముహూర్తంలోనే చాలా మంది పెళ్లిళ్లు చేస్తారు. ఇక తెలుగు పంచాంగం ప్రకారం మాఘ మాసం, శ్రావణ మాసం, వైశాఖ మాసంలో అధికంగా పెళ్లిళ్లు జరుగుతాయి. అయితే కొత్త ఏడాది 2026లో వచ్చే మాఘ మాసంలో పెళ్లిళ్లకు అనువైన శుభ ముహూర్తాలు లేవని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. శుక్ర మౌఢ్యమి కారణంగానే ఈ సారి మాఘ మాసంలో పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు లేవని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో శుక్ర మౌఢ్యమి అంటే ఏంటి..? మూఢంలో శుభకార్యాలు ఎందుకు చేయరు? అనే ఆసక్తికర విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

### మౌఢ్యమి అంటే ఏంటి..? ఇది ఏలా ఏర్పడుతుంది..?

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం మూఢాలు రెండు రకాలుగా ఉంటాయి. ఇందులో ఒకటి గురు మౌఢ్యమి కాగా, రెండోది శుక్ర మౌఢ్యమి. గురువు సూర్యునితో కలిసి ఉండే సమయాన్ని గురు మౌఢ్యమి అని, శుక్రుడు సూర్యునితో కలిసి ఉండే సమయాన్ని శుక్ర మౌఢ్యమి అని అంటారు. దీనినే వాడుక భాషలో మౌఢ్యమి అని వ్యవహరిస్తారు. నవగ్రహాల్లో గురుడు, శుక్రుడు తమ గమనంలో భాగంగా సూర్యునికి దగ్గరగా వచ్చినప్పుడు ఆ గ్రహాలు తమ స్వయం కాంతిని కోల్పోవడం వలన మూఢమి సంభవిస్తుంది. నవగ్రహాలకు అధిపతి సూర్యుడు. సూర్యుడు అతి పెద్ద గ్రహం. ఆయన తేజస్సు, శక్తి అనంతం. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం గురు శుక్ర గ్రహాలను శుభ గ్రహాలుగా పరిగణిస్తారు. అయితే సూర్యునికి దగ్గరగా ఈ గ్రహాలు వచ్చినప్పుడు వాటి తేజస్సు కోల్పోవడం వలన మౌఢ్యమి ఏర్పడి శుభకార్యాలు నిషేధిస్తారు.

### నవంబర్ 26 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్ర మౌఢ్యమి..!

శుక్ర మౌఢ్యమి నవంబర్ 26 నుంచి ప్రారంభమై, 2026 ఫిబ్రవరి 17వ తేదీ వరకు కొనసాగనుంది. అంటే తెలుగు పంచాంగం ప్రకారం.. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం మార్గశిర శుద్ధ షష్టి నుంచి మాఘ బహుళ అమావాస్య వరకు శుక్ర మౌఢ్యమి కొనసాగనుంది.
అంటే దాదాపు 83 రోజుల పాటు పెళ్లిళ్లకు శుభ ముహూర్తాలు లేనట్లే. ఈ కాలంలో పెళ్లిళ్లు జరగవు. ఎందుకంటే శుక్ర మౌఢ్యమినే కారణం.

### మూఢంలో ఈ కార్యక్రమాలు నిషిద్ధం..!

మూఢంలో వివాహాది శుభకార్యాలు, నూతన గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, గృహ నిర్మాణ ప్రారంభాలు, శంఖుస్థాపనలు, యజ్ఞాలు, నూతన వధువు గృహప్రవేశం, యజ్ఞం, దీక్షోపనయనం, వాహనాలు కొనడం, వ్యాపార ప్రారంభాలు, మహాదానాలు, పుట్టు వెంట్రుకలు తీయించడం, చెవులు కుట్టించడం, నూతన వ్యాపారాలు ఆరంభించడం, రాజ దర్శనం, రాజ్యాభిషేకం,చెరువులు తవ్వించడం వంటివి నిషిద్ధం.

# మన్జు జీవితాన్ని మార్చిన అమ్మ మాట

# అంబలితో లక్షల ఆదాయం

పెద్ద పెద్ద బిజినెస్ స్కూల్స్, మోటివేషనల్ పుస్తకాలు మాత్రమే జీవితాన్ని మార్చే ఐడియాలు ఇస్తాయనుకుంటే పొరపాటే. కొన్నిసార్లు సాధారణ ఇంటి వంటగది నుంచే పెద్ద పెద్ద ఆలోచనలు మార్పులు సంభవిస్తాయి. దీనికి నిదర్శనం మైసూరుకు చెందిన మన్జు జీవితం. అమ్మ ఇమ్మ చెప్పిన ఒక్క ఐడియా అతని జీవితాన్ని మార్చివేసింది. మైసూరుకు చెందిన మన్జు బీఏ పూర్తి చేసి బ్యాంకులో మంచి ఉద్యోగం సంపాదించాడు. నెలకు రూ.30 నుంచి 40 వేల వరకు జీతం వచ్చేది. కానీ, ఉద్యోగంలో పనిభారం మాత్రం విపరీతంగా ఉండేది. సెలవులు లేకుండా కఠినమైన టార్గెట్లు ఉండడం కుటుంబంతో గడిపేందుకు టైం ఉండేది కాదు. జీతం ఉన్నా జీవితంలో మన్జుకు ఆనందం లేకుండా పోయింది. ఏదైనా బిజినెస్ మొదలు పెడదామనుకున్నా.. ఏం చేయాలనే గందరగోళం నెలకొంది. కొత్త ఐడియాలు వచ్చినా వాటిని ప్రాక్టికల్ గా అమలు చేయాలేకపోయాడు.

### జీవితాన్ని మార్చిన 'అంబలి' ఆలోచన..

మన్జు ఇబ్బందులు చూస్తున్న అతని తల్లి. ఒకరోజు అతనికి ఊహించని ఐడియా ఇచ్చింది. తను ఇంట్లో ఏండ్లుగా చేసే సాధారణ వంటకం అంబలిని తయారు చేసి అమ్మమని చెప్పింది. రాగి, మజ్జిగతో చేసే అంబలి పాత కాలంలో పేదవాడి పానీయంగా ఉండేది. కానీ ఇప్పుడు కెమికల్స్ లేని సహజ ఆహారం మీద మళ్లీ ప్రజలు మొగ్గు చూపుతున్నారు. పోషకంగా, ఆరోగ్యకరంగా ఉండే అంబలికి ప్రస్తుతం డిమాండ్ పెరుగుతోంది. అయితే, అమ్మ మాట మన్జుకి మొదట సీరియస్‌గా అనిపించలేదు. కానీ.. అమ్మ నమ్మకం అతడిని ఒక్కసారైనా ప్రయత్నించమని ప్రేరేపించింది.

### రూ.300 తో ప్రారంభమైన వ్యాపారం

రెండో రోజు ఉదయం మన్జు జేబులో ఉన్న రూ.300 తీసుకుని మొదటి అడుగు వేసాడు. రూ.25కి పుష్కార్ట్ అద్దెకు తీసుకుని మైసూరు కుక్కరహ రైల్వే గేట్ దగ్గర తన అంబలి కార్ట్ నిలిపి.. అమ్మ చేసిన విధంగా అచ్చం అదే రుచితో అంబలి తయారు చేశాడు. గ్లాసను రూ.20కి అమ్మడం ప్రారంభించారు. మట్టికుండ, రాగి రంగు, సహజమైన సెటప్ ఇవి ప్రజల్ని వెంటనే ఆకర్షించింది. అతని బాల్యంలో తాగిన ఆ అంబలి ఈరోజు కూడా విలువైనదే అని మన్జు మధ్యాహ్నానికల్లా గ్రహించాడు.

### సహజమైన పదార్థాలే అతని బ్రాండ్

రోజురోజుకు కస్టమర్లు పెరుగుతుండటంతో తన మెనూలో మరిన్ని ఐటమ్స్ పెంచిన మన్జు. ఏది తయారు చేసినా సహజసిద్ధమైన వాటితోనే సిద్ధం చేయాలనే నిబంధన పెట్టుకున్నాడు. మట్టికుండల్లో చల్లటి మజ్జిగ, నిమ్మరసంఐస్ లేదు. కృత్రిమ రుచులేమీ కలపలేదు.. ఆ నిజాయితీనే మన్జుకు గుర్తింపును తెచ్చిపెట్టింది. దీంతో పాటు రుచి కోసమే కాకుండా పరిశుభ్రత, సహజత్వం, పాతకాలపు రుచితో అతని దగ్గరకు వచ్చే వారి సంఖ్య పెరిగింది.



### రోజుకి రూ. 5,000. నెలకి లక్షలు టర్నోవర్

చిన్నగా మొదలైన వ్యాపారం ఊహించని రీతిలో పెరిగిపోయింది. రోజుకు రూ.5వేలు రాగా అందులో ఖర్చులు పోను రూ.3 నంచి 4వేలు లాభం వచ్చేవి.. ఇలా సంవత్సరం పూర్తయ్యేసరికి మన్జు పుష్కార్ట్ అతనికి లక్షల సంపాదన తెచ్చిపెట్టింది. కష్టపడి పనిచేస్తే చిన్న పనైనా గొప్పదవుతుంది. ఒకప్పుడు పేదవాడి పానీయమైన అంబలి..
ఇప్పుడు మన్జు జీవితానికి ఆర్థిక స్వాతంత్ర్యం, ప్రశాంతత, గౌరవం తెచ్చిపెట్టింది. సరళమైన ఆలోచన, నిజాయితీ, క్రమశిక్షణ ఉంటే చిన్న పని పెద్ద విజయమే అవుతుంది అని మన్జు జీవితం నేర్పిస్తుంది.

# చలికాలంలో కోడి గుడ్డు రప్పారప్పా!

తెలుగు రాష్ట్రాలలో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తిండి ఖర్చుల భారం అమాంతంగా పెరిగిపోతుంది. వెజిటెరియన్ ఫుడ్ తీసుకునే వారికైనా..నాన్ వెజిటేరియన్ ఫుడ్ తీసుకునే వారికైనా ఈ ఖర్చుల స్ట్రోక్ తప్పడం లేదు. నిన్నమొన్నటిదాక కిలో 10రూపాయల పలికిన టమాటా ధరఇప్పుడు రూ.63కు పెరిగింది. ఇదే సమయంలో కిలో చికెన్ మాంసంరూ.250నుంచి 270కి పెరిగింది. పోనిలే కోడిగుడ్లతోనైనా సరిపెట్టుకుందామనుకుంటే ఒక్కో కోడిగుడ్డు రూ.8రూపాయల ధర పలుకుతుంది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో కూరగాయలతో పాటు కోడిగుడ్డు ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు చలికాలంలోనూ చెమటలు పట్టిస్తున్నాయి.



### ఒక్కో గుడ్డు రూ.8

కార్తీక మాసం వరకు అదుపులోనే ఉన్న చికెన్, కోడిగుడ్డు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అప్పటిదాక ఒక్కో గుడ్డు రూ.5 నుంచి రూ6వరకు ఉండగా..కార్తీక మాసం ముగిసిన వెంటనే ఒక్క గుడ్డు ధర 8రూపాయలు దాటిపోతుంది.దీంతో కోడిగుడ్డు కొనడానికి సామాన్య, మధ్య తరగతి ప్రజలు వెనకడుగు వేయాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు కోడిగుడ్ల ధరలు రోజురోజుకూ పెరుగుతండటంతో.. పాఠశాల, హాస్టల్ విద్యార్థులకు కోడిగుడ్లు అందించడం భారంగా మారిందని మధ్యాహ్న భోజన ఏజెన్సీలు వాపోతున్నాయి. కోడిగుడ్డు ధరల పెరుగుదలకు చలికాలంలో ఫౌల్ట్రీ రంగంలో తగ్గిపోయే కోడిగుడ్ల దిగుబడితో పాటు నార్త్ ఇండియాలో గుడ్ల వినియోగం కూడా కారణమంటున్నారు మార్కెట్ నిపుణులు. ఏపీ, తెలంగాణలో ఫౌల్ట్రీలలోని కోళ్లు వ్యాధులతో పెద్ద సంఖ్యలో చనిపోతుండటం..చలికి కోళ్లు గుడ్లను పెట్టడం తగ్గించనుండటంతో గుడ్ల ఉత్పత్తికి..డిమాండ్ కు మధ్య వ్యత్యాసరం పెరిగి.. గుడ్ల ధర కొండెక్కాయని ఫౌల్ట్రీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ఐటీ రిటర్న్స్ ఎవరు దాఖలు చేయాలి?

ఆదాయ పన్ను రిటర్న్స్ లేదా ఐటీ రిటర్న్స్ ఎవరు దాఖలు చేయాలి? ఐటీ రిటర్న్స్ దాఖలుతో లాభ, నష్టాలు ఏంటి? ప్రతి ఆర్థిక సంవత్సరం రిటర్న్స్ సబ్ మిట్ చేయాలా? రిటర్న్స్ దాఖలు చేయకపోతే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందా? ఐటీ రిటర్న్స్ మీ ఆర్థిక చరిత్రను తెలుపుతుందా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

### ఐటీ రిటర్న్స్ అంటే ఏంటి?




ఐటీఆర్ అంటే ఆదాయ పన్ను రిటర్న్స్ అంటారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తి సంపాదించిన ఆదాయం, ఆ ఆదాయంపై చెల్లించే పన్నుల వివరాలను ఆదాయపు పన్ను శాఖకు తెలపడానికి ఒక నిర్ణీత ఫారమే ఐటీ రిటర్న్స్ గా పిలుస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులే కాదు, వ్యాపారులు కూడా ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాలి. అయితే ఇది వారి ఆదాయంతో ముడిపడి ఉంటుంది. ఆదాయానికి సంబంధం లేకుండా మీ బ్యాంకు ఖాతాల లావాదేవీల ఆధారంగా కూడా కొన్ని సమయాల్లో ఐటీ రిటర్న్స్ ను దాఖలు చేయాల్సి రావచ్చు.

### ఎవరు ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాలి?

ఉద్యోగుల ఆదాయం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 12.75 లక్షలు దాటితే ఆదాయ పన్ను చెల్లించాలి. ఇతరుల ఆదాయం ఏడాదికి రూ. 12 లక్షలుంటే పన్ను కట్టాల్సిందే. 60 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న వారి ఆదాయం ఏటా రూ. 2.50 లక్షలు దాటితే ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాలి. 60 ఏళ్లు దాటిన వారు సీనియర్ సిటిజన్స్ ఆదాయం ప్రతి ఏటా రూ. 3 లక్షలు దాటితే ఐటీ రిటర్న్స్ సబ్ మిట్ చేయాలి. ఇక ఆదాయంతో సంబంధం లేకుండా కూడా రిటర్న్స్ దాఖలు చేయాల్సిన పరిస్థితులు కూడా రావచ్చు. ఒక ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయాలను బ్యాంకులో డిపాజిట్ చేస్తే రిటర్న్స్ దాఖలు చేయాలి. అయితే ఈ డబ్బును మీ ఒక్కరి బ్యాంకు ఖాతాలో కాకుండా మీ భార్య బ్యాంకు ఖాతాలో జమ చేస్తే ఇబ్బంది లేదు. విదేశాలకు వెళ్లిన సమయంలో రూ. 2 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే రిటర్న్స్ సబ్ మిట్ చేయాలి. విద్యుత్ బిల్లు రూ. 1 లక్ష దాటినా కూడా ఐటీ రిటర్న్స్ ఇవ్వాలి. వ్యాపారస్తులు తమ ఏడాది టర్నోవర్ రూ. 60 లక్షలు దాటితే చాలు రిటర్న్స్ ఇవ్వాలి. ప్రొఫెషనల్స్ ఆదాయం ఏడాదికి రూ. 10 లక్షలు దాటినా కూడా రిటర్న్స్ దాఖలు చేయాలి. టీడీఎస్ రూ. 25 వేలు దాటినా కూడా రిటర్న్స్ ఇవ్వాలి.

### లాభాలు ఏంటి? నష్టాలు ఏంటి?

ఐటీ రిటర్న్స్ ప్రతి ఏటా దాఖలు చేయడం వల్ల మీ ఆదాయం, ఆదాయంపై ట్యాక్స్ హిస్టరీ తెలుస్తుంది. ట్యాక్స్ పరిమితి దాటిన ఆదాయానికి ఎంత ట్యాక్స్ కట్టారో తెలుస్తుంది. ఒక రకంగా మీ ఆర్థిక క్రమశిక్షణను ఐటీ రిటర్న్స్ ద్వారా తెలుసుకోవచ్చు. బ్యాంకులు రుణాలు ఇచ్చే సమయంలో ఐటీ రిటర్న్స్ కూడా అడుగుతాయి. వీసాల ధరఖాస్తు సమయంలో, క్రెడిట్ కార్డు అప్లికేషన్స్ కు కూడా ఐటీ రిటర్న్స్ ను అడుగుతారు. భారీ టెండర్ల దక్కించుకొనే వేలంలో పాల్గొనే సమయంలో కొన్ని సంస్థలు ఐటీ రిటర్న్స్ ను అడిగే అవకాశం ఉంది. ఐటీ రిటర్న్స్ అంటే మీ ఆదాయానికి అధికారిక రుజువుగా కూడా చెప్పుకోవచ్చు. ప్రతి ఏడాది ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాల్సిన అవసరం ఉంటుందా? అంటే లేదనే సమాధానాన్ని కొందరు ఆడిటర్లు చెబుతున్నారు. ఒక ఆర్థిక సంవత్సరం మీ ఆదాయం తగ్గితే ఆ సంవత్సరం ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాల్సిన అవసరం ఉండదు.



# ఓవర్ డ్రాఫ్ట్ అంటే ఏంటి? దీని వల్ల లాభాలు ఏంటి?



మీ బ్యాంకు ఖాతాలో చిల్లిగవ్వ లేద. అయినా కూడా మీకు సమయానికి బ్యాంకు డబ్బులు అందిస్తుందనే విషయం తెలుసా? దీన్నే ఓవర్ డ్రాఫ్ట్ ఓడీ అంటారు. ఓడీ అందరూ తీసుకోవచ్చా? వడ్డీ ఎంతుంటుంది? ఎప్పుడు దీన్ని చెల్లించాలి? ఓడీ మంజూరుకు ముందు బ్యాంకులు ఎలాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయనే విషయాలను తెలుసుకుందాం.

### ఓవర్ డ్రాఫ్ట్ అంటే ఏంటి?

మీ బ్యాంకు ఖాతాలో ఒక్క పైసా లేకున్నా అవసరానికి డబ్బులు సర్దుబాటు కావడమే ఓవర్ డ్రాఫ్ట్. ఒక రకంగా చెప్పాలంటే ఓడీ అంటే తప్పనిసరి క్రెడిట్ సదుపాయం. వ్యాపారులు ఉపయోగించే కరెంట్ ఖాతాలే కాదు సాధారణంగా శాలరీ ఖాతాలు కలిగిన వారు కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. ఇది స్వల్పకాలిక రుణ ఆప్షన్. అత్యవసర ఆర్థిక పరిస్థితుల నుంచి బయటపడేందుకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వరంగ బ్యాంకైన ఎస్ బీఐ, ఐసీఐసీఐ వంటి ప్రైవేట్ బ్యాంకులు కూడా ఓడీ సౌకర్యాన్ని అందిస్తున్నాయి.

### ఓవర్ డ్రాఫ్ట్ ఎంతైనా తీసుకోవచ్చా?

ఓవర్ డ్రాఫ్ట్ ఎంతైనా తీసుకొనే అవకాశం లేదు. మీరు ఉపయోగించే ఖాతా, మీ ఆర్థిక పరిస్థితులు, బ్యాంకు నిబంధనలు, మీ క్రెడిట్ స్కోర్ తో పాటు ఇతర అంశాలు ఓవర్ డ్రాఫ్ట్ ను నిర్ణయిస్తాయి. కరెంట్ ఖాతా, పొదుపు ఖాతాలకు వేర్వేరుగా ఓడీ ఉంటుంది. కరెంట్ ఖాతాలకు ఎక్కువ మొత్తంలో ఓడీ తీసుకొనే వెసులుబాటు ఉంటుంది. శాలరీ ఉద్యోగులైతే తాము తీసుకొనే జీతానికి మూడు రెట్లు అదనంగా కూడా ఓడీ తీసుకొనే అవకాశం ఉంది. ఓడీపై ప్రతి రోజూ వడ్డీని లెక్కిస్తారు. ఓడీ తీసుకొనే సమయంలో ముందస్తు చెల్లింపు చేయాల్సిన అవసరం లేదు. ఓవర్ డ్రాఫ్ట్ నకు సంబంధించిన ముందస్తు చెల్లింపు చేయడంలో విఫలమైతే అప్పుడు వడ్డీ మొత్తాన్ని నెలాఖరులో అసలుకు మొత్తాన్ని జోడిస్తారు. అనంతరం మొత్తం అసలుపై వడ్డీని లెక్కిస్తారు.

### ఓడీకి పూచీకత్తు పెట్టాలా?

ఓడీ(Over Draft) ఇచ్చేందుకు చాలా బ్యాంకులు ఏదైనా పూచీకత్తును అడుగుతున్నాయి. కొన్ని బ్యాంకులు ఎలాంటి పూచీకత్తు లేకుండానే ఓడీ ఇస్తున్నాయి. అయితే ఖాతాదారుడి క్రెడిట్ హిస్టరీ ఆధారంగా కొన్ని బ్యాంకులు ఓడీని ఇస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ఫిక్స్ డిపాజిట్లపై ఓడీలు మంజూరు చేస్తున్నాయి. ఇంటిని పూచీకత్తుగా చూపితే కూడా ఓడీ ఇస్తున్నాయి కొన్ని బ్యాంకులు. అయితే ఆ ఇంటి విలువను బ్యాంకులు ముందుగా నిర్ణయిస్తాయి. హౌసింగ్ లోన్లు చెల్లించేందుకు కూడా ఓడీ తీసుకోవచ్చు. మీరు మీ బీమా పాలసీని మీ ఓవర్‌డ్రాఫ్ట్‌నకు కొలేటరల్‌గా ఉంచుకుంటే మంజూరు చేసిన మొత్తం మీ బీమా పాలసీ సరెండర్ విలువపై ఆధారపడి ఉంటుంది. బీమా పాలసీ లోన్-టు-వాల్యూ, ఫిక్స్‌డ్ డిపాజిట్ల లోన్ టూ వాల్యూకు దాదాపు సమానంగా ఉంటుంది. అంటే మీరు మీ బీమా పాలసీని ఫిక్స్‌డ్ డిపాజిట్ కి బదులుగా ఉంచుకుంటే దాదాపు అదే మొత్తాన్ని మంజూరు చేయవచ్చు. బ్యాంకుల్లో శాలరీ ఖాతాలు కలిగిన ఉద్యోగులు వారి జీతాలకు ప్రతిగా ఓవర్‌డ్రాఫ్ట్‌లను కూడా అందిస్తాయి. మీరు మీ జీతం కంటే 2-3 రెట్లు ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితిని పొందవచ్చు. కానీ ఇది రుణదాత నుండి రుణదాతకు మారుతుంది. షేర్స్ ను కూడా పూచీకత్తుగా పెట్టి ఓడీ పొందవచ్చు. అయితే షేర్స్ విలువ తగ్గుతూ పెరుగుతూ ఉంటుంది. అందుకే షేర్స్ పూచీకత్తుగా పెడితే ఓడీ తక్కువగా వస్తుంది.

### వడ్డీ రేటు ఎంత?

ఓవర్ డ్రాఫ్ట్ కు వడ్డీరేటు ఆయా బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల ఆధారంగా ఉంటుంది. మీరు తీసుకున్న ఓడీ రకం, బ్యాంకు విధానాలు, ఖాతాదారుడి క్రెడిట్ హిస్టరీ వంటి అంశాలు కూడా వడ్డీరేటును ప్రభావితం చేస్తాయి. ఈఎంఐ తరహాలో ఓడీ చెల్లించాల్సిన అవసరం లేదు. మీ దగ్గర డబ్బులున్నప్పుడు ఓడీ చెల్లించే వెసులుబాటు ఉంటుంది. మీకు వెసులుబాటు ఉన్న సమయంలో మీ వద్ద ఉన్న నగదును చెల్లించే వెసులుబాటు ఉంది. ఓడీని ఎక్కువ కాలం చెల్లించకుండా ఆలస్యం చేయవద్దు. ఇలా చేస్తే అది మీ సిబిల్ స్కోర్ పై ప్రభావం చూపిస్తుంది.



# హీరోలుగా ఎంట్రీ ఇస్తున్న డిఎస్పీ, లోకేశ్ కనగరాజ్

తెర వెనక సత్తా చాటిన ఎందరో సాంకేతిక నిపుణులు, డైరెక్టర్లు తెర పైనా సందడి చేశారు. నటులుగానూ తమదైన ముద్ర వేశారు. ఇదే దారిలో ఇప్పుడు మరికొందరు హీరోలుగా పరిచయం కానున్నారు. రెండు దశాబ్దాలకు పైగా తన సంగీతంతో శ్రోతలను ఉర్రూతలూగిస్తున్న దేవిశ్రీ ప్రసాద్ ఎల్లమ్మ' మూవీతో హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. డప్పు కళాకారుడిగా ఆయన నటిస్తున్నారు. 'బలగం' తర్వాత వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న చిత్రమిది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం కూడా డీఎస్పీనే అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. 'ఖైదీ', 'విక్రమ్' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ థ్రిల్ చేసిన కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. వామికా గబ్బీ హీరోయిన్.

అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్- యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ప్రేక్షకులతోపాటు సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన మలయాళ దర్శకుడు అభిషన్ జీవింత్ ఈ మూవీలో ఓ పాత్ర పోషించిన ఆయన.. 'విత్ లవ్' తో హీరోగా మారారు. ఈ రొమాంటిక్ డ్రామాలో అనస్వర రాజన్ హీరోయిన్. మదన్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 6న తెలుగులోనూ విడుదల కానుంది. కొరియోగ్రాఫర్ యశ్ హీరోగా 'ఆకాశం దాటి వస్తావా' సినిమాని 'దిల్ రాజు ప్రొడక్షన్స్' సంస్థ గతంలో ప్రకటించింది. ఈ మేరకు ఓ వీడియోనూ విడుదల చేసింది. కానీ, తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. ఈ విభిన్న ప్రేమకథా చిత్రానికి శశికుమార్ దర్శకుడు. ÷ట్ మాస్టర్ పీటర్ హెయిన్ మూవీ కూడా అంతే. అనౌన్స్ చేసి చాలాకాలమైనా మరో అప్‌డేట్ లేదు. ఈ చిత్రానికి మా వెట్రి దర్శకుడు. టైటిల్ ఇంకా ఖరారు కాలేదు.






# ఏప్రిల్ 10న స్వయంభు విడుదల

యంగ్ అండ్ డైనమిక్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిపోయే అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్వయంభూ' విడుదల తేదీని చింత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా విడుదలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది వేసవి కానుకగా, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ పాన్-ఇండియా చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా కోసం నిఖిల్ పడుతున్న శ్రమ అంతా ఇంతా కాదు. ఒక యోధుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తన శరీరాకృతిని పూర్తిగా మార్చుకున్నారు. కేవలం ఫిజిక్ మాత్రమే కాకుండా, యుద్ధ సన్నివేశాల్లో సహజత్వం కోసం విదేశాల్లో కత్తిసాము, గుర్రపు స్వారీ ,విలువిద్యలో ప్రత్యేక శిక్షణ పొందారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజువల్స్ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటాయని సమాచారం. అయితే తాజాగా నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లింప్స్ ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సినిమాపై అంచనాలను మరో మెట్టు ఎక్కించింది. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ఈ చారిత్రక గాథ తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.



# బాలకృష్ణ, గోపీచంద్ కాంబినేషన్‌లో 111వ సినిమా

మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు ప్లాన్


నందమూరి బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ అంటేనే బాక్సాఫీస్ వద్ద మాస్ జాతర మొదలైనట్లే. 'వీరసింహా రెడ్డి' వంటి భారీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న 111వ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. అయితే, ఈ సినిమా షూటింగ్ విషయంలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న సస్పెన్స్‌కు ఇప్పుడు తెరపడింది. మొదట ఈ ప్రాజెక్ట్‌ను సుమారు రూ.170 కోట్ల భారీ బ్జడెట్‌తో ఒక చారిత్రక నేపథ్యం ఉన్న కథతో చేయాలనుకున్నారు. కానీ, ప్రస్తుతం మారిన మార్కెట్ పరిస్థితులు, బ్జడెట్ లెక్కల దృష్ట్యా ఆ కథను పక్కన పెట్టి, బాలయ్య ఇమేజ్‌కు సరిపోయే పక్కా మాస్ యాక్షన్ కథను గోపీచంద్ సిద్ధం చేశారు. ఇటీవలే దర్శకుడు వినిపించిన ఈ కొత్త కథకు బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, వచ్చే మార్చి నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ 'వృద్ధి సినిమాస్' ధృవీకరించింది. తొలి షెడ్యూల్‌లోనే బాలయ్య మార్క్ అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు ఎలాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ విషయానికి వస్తే, పాత కథ ప్రకారం నయనతారను ఎంపిక చేసినప్పటికీ, ఇప్పుడు కథ మారడంతో ఆమెనే కొనసాగిస్తారా లేక కొత్త హీరోయిన్‌ను తీసుకుంటారా అనే దానిపై సస్పెన్స్ నెలకొంది. ఏదేమైనా, బాలయ్య మార్క్ పవర్‌ఫుల్ డైలాగులు, గోపీచంద్ టేకింగ్ కలిసి మరోసారి బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో 29న ఛాంపియన్ విడుదల

తెలంగాణ రాజకార్లను ఎదురొడ్డిన బైరాన్‌పల్లి గ్రామ కథ ఆధారంగా రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్' గత డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి మంచి టాక్ తెచ్చుకుంది. ఇందులోని గిరగిరతో పాటు పాటలు హిట్ అయ్యాయి. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. 'నెట్‌ఫ్లిక్స్' లో ఈనెల 29 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, రచ్చరవి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే' పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి.విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్‌గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లేందుకు అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు



దేశ్‌ముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.






# దురంధర్‌ను మించిన బోర్డర్-2

దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'ధురంధర్' ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' అదే రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లు (నెట్) కలెక్షన్లు రాబట్టింది. 'ధురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు మాత్రమే. సన్నీ దేవోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో అనురాగ్ సింగ్ 'బోర్డర్ 2'ను తెరకెక్కించారు. 1971 ఇండో - పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300? కోట్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమా లిస్ట్‌లో నాలుగులో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి ఈ 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల టాక్.

# రాజాసాబ్ నుంచి సహనా సహనా వీడియో సాంగ్ విడుదల

సంక్రాంతి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన చిత్రాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కించిన చిత్రమిది. ఇందులోని మెలోడీ 'సహనా సహనా' ఫుల్ వీడియో విడుదలైంది. ప్రభాస్- నిధి అగర్వాల్‌పై రూపొందించిన సాంగ్ ఇది. ఈ చిత్రం మంచి టాక్‌తో ప్రభాస్ మేనరిజాన్ని బాగా ఎలివేట్ చేసింది. మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినమా థియేటర్లలో ఆడుతోంది.

PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154